




RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 09.10.2026 | సంపుటి :13 సంచిక : 80 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







# జ్ఞానేశ్ రాజీనామా చెయ్..

## సీఈసీ దిగిపోయే వరకు పోరు ఆగదు

## మూడో రోజూ మిన్నంటిన నిరసనలు



"రాజ్యసభ, లోక్‌సభలకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు శాంతియుతంగా నిరసన తెలపాలని భావిస్తున్నారు. రెండు రోజులుగా మమ్మల్ని నిరసన చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. మొదటి రోజు, మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయం బయట అడ్డుకున్నారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపాలని మేము భావించాము. బుధవారం మీరు చూసినట్లుగా, మమ్మల్ని అక్కడ కూడా అడ్డుకున్నారు. మా వాళ్లపై దాడులు చేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. వాస్తవం ఏమిటంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భగవత్‌లు ఒక నేరపూరిత కుట్ర ద్వారా దేశాన్ని హైజాక్ చేశారు. రాజ్యాంగాన్ని నాశనం చేశారు. ఓట్లను దొంగిలించారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ప్రతిపక్షంగా మేము హామీ ఇస్తున్నాం. వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం. ఈ నలుగురు చట్టం ముందు నిలబడటాన్ని మీరు చూస్తారు." - రాహుల్ గాంధీ,

న్యూఢిల్లీని బాపూఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

నివాళుల అనంతరం అక్కడే నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రతనేలు

## బాపూఘాట్ వద్ద కాంగ్రెస్ అగ్రనేతల శ్రద్ధాంజలి



### మోదీ, అమిత్‌షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద ప్రార్థనలు

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అపాయింట్‌మెంట్ కోరిన ఇండీ కూటమి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసనకు దిగారు. ఆందోళనల్లో భాగంగా తొలుత విపక్ష ఎంపీలంతా కలిసి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు."300 మంది ఎంపీలందరం కలిసి ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. నిన్న జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాలని ప్రయత్నించాం. కానీ మమ్మల్ని అనుమతించలేదు. మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు. ఆ తర్వాత నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లి నిరసన తెలియజేస్తామని అడిగితే.. మమ్మల్ని ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుమార్ కుట్ర పన్నుతున్నారు. ఆ నలుగురికి శిక్ష పడటం మీరే చూస్తారు" అని రాహుల్ అన్నారు.ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ మిగతా 2లో..



### ప్రియాంక చీరనే లాగితే... సామాన్య మహిళలకు

## దిక్కెక్కడ?

"రాహుల్.. వీళ్లు నా బట్టలు లాగుతున్నారు" అంటూ ప్రియాంక ఆవేదన

మహిళా ఎంపీకే ఇలాంటి పరిస్థితి వస్తే.. ప్రజాస్వామ్య నిరసనల్లో భద్రత, గౌరవం మాటేమిటి?

న్యూఢిల్లీ,(జనంసాక్షి):ఢిల్లీలో ప్రతిపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి మిగతా 2లో..

### మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే

## దింపుతారు

- జనాభా 140 కోట్లు దాటితే 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా?
- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
- ఓటు బచావో... దేశ్ బచావో ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి



### జ్ఞానేశ్ నియామకంపై సుప్రీంలో పిటిషన్

నిరసనల వేళ కీలక పరిణామం

ఆందోళనల వేళ సీఈసీకి భారీగా భద్రత పెంపు

2లో..

### జ్ఞానేశ్‌కు 42 మంది మాజీ న్యాయమూర్తుల వత్తాసు

ఆధారాలు లేకుండా సీఈసీపై ఆరోపణలు సరికాదని వ్యాఖ్యలు



### బీజేపీని వ్యతిరేకించే వారి ఓట్లు తొలగించేందుకే సర్

- సీఈసీ రాజీనామాకు అభిజీత్ దీప్కే, ప్రకాశ్ రాజ్ డిమాండ్
- సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా బెంగళూరులో సీజేపీ ఆధ్వర్యంలో పీపుల్స్ ట్రైబ్యునల్ పేరుతో భారీ నిరసన

బెంగుళూరు(జనంసాక్షి):కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కొద్ది రోజులుగా ఈ సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీలు సహా కాక్రోచ్ జనతా పార్టీ ఇతర పౌర సమాజ సంఘాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ సర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ, ఇతర పౌర సమాజ ప్రతినిధులతో కలిసి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో 'పీపుల్స్ ట్రైబ్యునల్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిజీత్ దీప్కే మిగతా 2లో..

### ఇండీ కూటమి ఆధ్వర్యంలో

## చలో లోక్‌భవన్

- సేవ్ డెమోక్రసీ పేరుతో భారీ నిరసన
- పలువురు మంత్రుల అరెస్టు
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం:మహేశ్ గౌడ్




హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం తెలంగాణ కాంగ్రెస్, ఇండియా కూటమి చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సేవ్ డెమోక్రసీ పేరుతో కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చలో లోక్‌భవన్ చేపట్టారు. నెక్లెస్ రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీగా బయలుదేరిన నేతలను లోక్ భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు నేతలు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేం దర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి నాయకులను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మిగతా 2లో..

### నిరసనను నిరాకరించడం ప్రజాస్వామ్యంపై దాడే

- పార్లమెంటు సభ్యులపై క్రిమినల్ కేసులు అతిశయోక్తి చర్య
- ఖండించిన ఫోరం ఫర్ కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ

*హైదరాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి):* రాజ్యాంగం హామీ ఇచ్చిన నిరసన హక్కును నిరాకరిస్తే ఇక మిగిలేది ఎలాంటి ప్రజాస్వామ్యమని ఫోరం ఫర్ కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ (ఎఫ్‌సీడీ) ప్రశ్నించింది. శాంతియుతంగా సమావేశమై తమ నిరసనను వ్యక్తం చేసే హక్కును రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిందని పేర్కొంది. ఇది దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి సంక్రమించిన గొప్ప ప్రజాస్వామ్య వారసత్వమని తెలిపింది. అక్టోబర్ 7న ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో శాంతియుత నిరసనకు గుర్తింపు పొందిన వేదికను వందలాది మంది పోలీసు సిబ్బందితో భారీగా దిగ్బంధించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఎఫ్‌సీడీ సంయుక్త ప్రకటనలో పేర్కొంది. ప్రతిపక్ష నాయకులు కేవలం శాంతియుతంగా కూర్చొని నిరసన తెలిపేందుకు అనువైన ప్రదేశాన్ని చూపించాలని పోలీసులను కోరారని తెలిపింది. ప్రజాప్రతినిధులు తమ ప్రాథమిక రాజ్యాంగ హక్కును వినియోగించుకునేందుకు అనుమతించాల్సిన పోలీసులు, అందుకు బదులుగా వారిని నిర్బంధించేందుకు బలప్రయోగం చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన సమయంలో ప్రతిపక్ష నేత, ఇతర పార్లమెంటు సభ్యులు పోలీసులపై దాడి చేశారంటూ ఎఫ్ఐఆర్‌లలో చేసిన ఆరోపణలను ప్రజలు విశ్వసించాలని ఢిల్లీ పోలీసులు నిజంగా ఆశిస్తున్నారా అని ప్రశ్నించింది. రాహుల్ గాంధీతో పాటు ఇతర పార్లమెంటు సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని చట్ట అమలు సంస్థల మిగతా 2లో..

## కరెంటు కోతలపై రోడ్డెకిన్న రైతులు



### రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

సిద్దిపేట(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇప్ప దయాకర్ రైతుల తరపున అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాల ని కోరారు. పొలాల్లో పంటలు ఎండిపోతున్నాయి. కరెంటు లేక రైతుల కష్టం వృథా అవుతోంది. వెంటనే విద్యుత్ సరఫరా చేయాలం టూ అధికారుల కాళ్లపై పడి వేడుకున్న మిగతా 2లో..

### కరెంటు కష్టాలు కాంగ్రెస్ వల్లే

నీళ్లు అడిగినందుకు రైతుల చేతులకు బేడీలు వేస్తారా..

సర్కారుపై హరీష్‌రావు ఆగ్రహం

2లో..

జూరాల నుంచి నీరు విడుదల చేసిన

### రైతులపై కేసులు

### జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

- నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం
- పన్ను మోసాలపై కఠిన చర్యలు
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం
- మరింత ఆర్థిక నష్టానికి అవకాశం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన




న్యూఢిల్లీ(జనంసాక్షి): జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు. జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనని భట్టి పేర్కొన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.

**తెలంగాణపై జీఎస్టీ ప్రభావం**

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో మిగతా 2లో..

### పన్ను అధికారులకు అరెస్టు అధికారం రద్దు

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు



### ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

కార్డియాక్ అరెస్టుతో తుదిశ్వాస విడిచిన దిగ్గజ నటుడు

మృతిపై ప్రముఖుల సంతాపం

పనాజీ(జనంసాక్షి):ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ (75) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు గోవాలోని తన నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు, మిగతా 2లో..

### కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్యంలో నోబెల్

2లో..



### తెలంగాణలో కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది దరఖాస్తు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది, ఎన్ఆర్ఐలు 6వేల మంది దరఖాస్తు చేసుకున్నారని సీఈవో కార్యాలయం తెలిపింది. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 5,04,782 దరఖాస్తు చేసుకున్నారని ప్రకటించింది. ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం-7లు అందాయని పేర్కొంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు నిన్నటితో ముగిసింది. నవంబరు 5 వరకు దరఖాస్తులను పరిష్కరించి.. నవంబరు 9న తుది జాబితాలో ప్రచురిస్తారు. హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం 6,335 ఫామ్-7లు వచ్చినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. నగరంలో భారీగా బోగస్ ఫామ్‌లు దరఖాస్తు చేశారని మిగతా 2లో..

### క్యాన్సర్ ఔషధాల మార్జిన్‌పై పరిమితి విధించిన కేంద్రం

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్యాన్సర్ మందుల ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాన్-షెడ్యూల్డ్ యాంటీ క్యాన్సర్ డ్రగ్స్‌పై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించింది. మొత్తం 110 రకాల మందులు ఈ పరిమితి పరిధిలోకి రానున్నాయి. దీంతో తయారీదారు నుంచి మందు రోగికి చేరే వరకు మధ్యలోని వ్యాపారులు, పంపిణీదారులు అధిక మార్జిన్ వసూలు చేయకుండా నియంత్రణ ఏర్పడనుంది. ఈ నిర్ణయం అక్టోబరు చివరి వారంలోగా పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కొన్ని ఎంపిక చేసిన నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై మాత్రమే 30 శాతం ట్రేడ్ మార్జిన్ పరిమితి అమల్లో ఉంది. 42 రకాల మందులకు మిగతా 2లో..

## ప్రియాంక చీరనే లాగితే... సామాన్య మహిళలకు దిక్కెక్కడ?

తరలించిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. నిరసనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రియాంకను పోలీసులు, భద్రతా సిబ్బంది ఈడ్చుకుంటూ వాహనం వైపు తీసుకెళ్లారు. ఈ సమయంలో ఆమె చీర లాగబడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ తోపులాట సమయంలో తీవ్ర ఆందోళనకు గురైన ప్రియాంక తన సోదరుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి “రాహుల్.. యే మేరే కప్డే ఉతార్ రహే హై” అంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు వైరల్ వీడియోల్లో వినిపిస్తోంది. అంటే “రాహుల్.. వీళ్లు నా బట్టలు లాగుతున్నారు” అని ఆమె పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రియాంక గాంధీ సాధారణ నిరసనకారిణి కాదు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మనవరాలు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనవరాలు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కుమార్తె, ప్రస్తుతం లోక్‌సభ సభ్యురాలు. ఒక మహిళా ప్రజాప్రతినిధిని అదుపులోకి తీసుకునే సమయంలో ఆమె గౌరవం, భద్రతకు భంగం కలగకుండా పోలీసులు మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందనే ప్రశ్నలు ఈ ఘటనతో తలెత్తుతున్నాయి. నిరసనను నియంత్రించేందుకు పోలీసులకు చట్టబద్ధమైన అధికారాలు ఉండవచ్చు. కానీ ప్రజాప్రతినిధిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఆమె దుస్తులు లాగబడే పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్నది సమాధానం కావాల్సిన ప్రశ్న. ఒక మహిళా ఎంపీనే “నా బట్టలు లాగుతున్నారు” అంటూ తన సోదరుడిని పిలవాల్సిన పరిస్థితి ఏర్పడితే, సాధారణ మహిళలు పోలీసు చర్యల సమయంలో తమ గౌరవం, భద్రతపై ఎలా నమ్మకం పెట్టుకోవాలన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది. ప్రజాస్వామ్యంలో నిరసనను అడ్డుకోవచ్చు. చట్టాన్ని అమలు చేయవచ్చు. కానీ ఒక మహిళ గౌరవాన్ని కాపాడటం కూడా అదే వ్యవస్థ బాధ్యత కాదా? ప్రియాంక గాంధీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆ సమయంలో ఏం జరిగిందో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది.

## నిరసనను నిరాకరించడం ప్రజాస్వామ్యంపై దాడే

అతిశయోక్తి చర్యగా తీవ్రంగా భావిస్తున్నామని పేర్కొంది. ఇది అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆందోళనలను మరింత బలపరుస్తోందని తెలిపింది. ఎన్నికైన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాష్ట్రం నిరాకరిస్తే, అది ప్రాథమిక రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను బలహీనపరుస్తుందని ఎఫ్‌సీడీ పేర్కొంది. చట్టాలను రూపొందించే ప్రజాప్రతినిధులే ఈ దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును వినియోగించుకోలేకపోతే, ఇక సామాన్య పౌరుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. పోలీసుల అధికార దుర్వినియోగ ధోరణిని, ప్రతిపక్షాల పట్ల అనుసరించిన శత్రుత్వపూరిత వైఖరిని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని తెలిపింది. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను అత్యంత తీవ్ర పదజాలంతో ఖండిస్తున్నామని ఎఫ్‌సీడీ కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ రామ మెల్కోటే, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, డా. గోపాల్ రెడ్డి గాడే, సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇండీ కూటమి ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్..

మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిని తప్పుబట్టారు. ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నా కూడా పదవిలో కొనసాగడం సరికాదన్నారు. తక్షణమే ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసే పరిస్థితుల్లో కేంద్ర ఎన్నికల సంఘం లేదని ఆరోపించారు. ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. దిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సహా ఇండియా కూటమి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్యంలో నోబెల్

స్వీడన్(జనంసాక్షి):సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు ప్రతిష్ఠాత్మక నోబెల్ లభించింది. సమకాలీన సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఆమె సృజనాత్మక రచనలకు గాను ఈ పురస్కారం ప్రకటించినట్లు స్వీడిష్ అకాడమీ వెల్లడించింది. అన్నే కార్సన్ 1950 జూన్ 21న కెనడాలోని టొరంటోలో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ టొరంటోలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆమె రచనలు, అనువాదాలకు సంబంధించి ఇప్పటివరకు 20కిపైగా పుస్తకాలు ప్రచురితమయ్యాయి. గ్రిఫిన్ పోయెట్రీ ప్రైజ్, లానన్ లిటరరీ అవార్డు వంటి సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్‌పై ప్రకటన రానుంది.

## క్యాన్సర్ ఔషధాల మార్జిన్‌పై పరిమితి విధించిన కేంద్రం

ఈ విధానం వర్తింపజేయడంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున సుమారు 50 శాతం తగ్గాయని కేంద్రం గతంలో వెల్లడించింది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా జరిగినట్లు వివరించింది. మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్రం తాజా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిటైలర్లకు కేవలం రూ.2,700కే సరఫరా అవుతున్న ఒక క్యాన్సర్ ఔషధంపై.. రూ.27 వేల ఎంఆర్‌పీ ముద్రించడంగ్భ్రాంతికరమని పేర్కొంది. ఇలాంటి భారీ వ్యత్యాసాలను నియంత్రించాల్సిన అవసరాన్ని కోర్టు ప్రశ్నించింది. ఈ విధానం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## కరెంటు కోతలపై రోడ్డెకిన్న రైతులు

దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేసింది. విత్తనం వేసింది రైతు. పంటను పెంచింది రైతు. నీళ్ల కోసం తపించింది రైతు. ఇప్పుడు కరెంటు కోసం కాళ్లు పట్టుకోవాల్సింది కూడా రైతేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టానికి విలువ లేదా? పంట ఎండిపోతే రైతు కన్నీటికి బాధ్యత ఎవరిది? 24 గంటల విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీలు మాటల్లో కాకుండా పొలాల్లో అమలు అయి రైతు పంటను కాపాడాలని అధికారులను విన్నవించారు. కాగా కరెంటు కోతలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి నిజాంపేట ప్రధాన రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కష్టాలని నిరంతర కరెంటు సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. నాణ్యమైన కరెంటు సరఫరా చేయకపోవడంతో లో ఓల్టేజ్ తో పొలాల కాడ మోటర్లుకాలిపోతున్నాయని, పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతుంటే రైతుల గుండెలు పగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు యూరియా సమస్యతో సతమతమవుతున్న రైతుకు కరెంటు సమస్య పెనుభూతంగా మారిందన్నారు. స్వచ్ఛమైన 24 గంటల కరెంటు అందించేంతవరకు బీఆర్ఎస్ పార్టీ తరపున జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రోడ్డుపై గంటపాటు సాగిన రాస్తారోకోతో సుమారు కిలోమీటర్ మేర వాహనాలు ఎక్కడికి అక్కడ ఆగిపోయినాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రైతులను, నాయకులను సముదాయించారు.

# జ్ఞానేశ్ రాజీనామా చెయ్..

ఎంపీలు స్పష్టం చేశారు. అఇఅ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్‌కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, అఇఅ జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అపాయింట్‌మెంట్ కోరిన ఇండీ కూటమి

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు.

'చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం'

ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి” అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

## జ్ఞానేశ్ నియామకంపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఈసీతో పాటు ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో పాటు 2023 నియామక చట్టంపైనా పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించడాన్ని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. సర్‌ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఎత్తున ఆందోళన చేపట్టింది. ఇందులో నటుడు ప్రకాశ్ రాజ్ కూడా పాల్గొన్నారు. సర్ ప్రక్రియతో దేశ ప్రజలను అవమానించారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. “జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడం ఒక్కటే మా నిరసన లక్ష్యం కాదు. ఆయన వెళ్తే ఇంకొకరు వస్తారు. అందుకే సర్ ప్రక్రియనే రద్దు చేయాలి” అని వారు డిమాండ్ చేశారు. ఇక, సుదీర్ఘ ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. 10వ తేదీన ప్రారంభమయ్యే ఆ పోరాటాన్ని.. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరిగే వరకూ కొనసాగించాలని సీజేపీ, విద్యార్థి సంఘాలు నిశ్చయించాయి. ఈ నేపథ్యంలో దిల్లీ యంత్రాంగం అప్రమత్తమైంది. నిరసనల నేపథ్యంలో భారీగా పోలీసులను, భద్రతా దళాలను రంగంలోకి దించేందుకు సిద్ధమైంది.

## మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే దింపుతారు

ఢిల్లీ(జనంసాక్షి):ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని సీఎం డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని సీఎం అన్నారు. ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలు గురువారం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

ఓటు బచావో...

దేశ్ బచావో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండియా కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే, 2019 నాటికి ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తుచేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని సీఎం తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్ వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడారని, స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటి వరకు సర్ ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదని సీఎం అన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకొని వాటిని తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు.

### జ్ఞానేశ్‌కు 42 మంది మాజీ న్యాయమూర్తుల వత్తాసు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల సంఘానికి పదుల సంఖ్యలో విశ్రాంత న్యాయమూర్తులు మద్దతుగా నిలిచారు. ఈసీ న్యాయవ్యవస్థ తదితర రాజ్యాంగబద్ధ వ్యవస్థల ప్రతిష్ఠను దిగజార్చవద్దని పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాలు వ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు 42 మంది మాజీ జడ్జీలు బహిరంగ లేఖ రాశారు. ‘దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరంతర దాడులు జరుగుతున్నాయి. సంస్థలపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్య హక్కు.. కానీ వాటిని కించపరచకూడదు. ఇటీవల పరిణామాలు ఆందోళన కరంగా ఉన్నాయి’ అని మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఓటు చోరీపై సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తుండటాన్ని ప్రశ్నించారు.

## బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకే ‘సర్’

సహా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు, కార్యకర్త అయిన ప్రకాశ్ రాజ్- ఎన్నికల సంఘం తీరుపై విరుచుకు పడ్డారు. సర్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు తాము బతికే ఉన్నాయని చూపించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే వారిలో కొందరిని వేదికపైకి తీసుకొచ్చి ‘వారు భౌతికంగా చనిపోలేదు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోంది.’ అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, ఇంకా ఒక్క కర్ణాటకలోనే దాదాపు కోటి ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఓట్లను తొలగించి, దొంగిలించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారని విమర్శించారు. ప్రధాని, ఎన్నికల సంఘం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలతోనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం అధికారులు ఓట్లు తొలగిస్తున్నారని విమర్శలు చేశారు. ఇదే సమయంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కూడా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాలని దీప్కే పిలుపునిచ్చారు.

### జూరాల నుంచి నీరు విడుదల చేసిన
## రైతులపై కేసులు

వనపర్తి (జనంసాక్షి): వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీళ్లు వదిలిన 14 మంది రైతులపై కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు, నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న సాయంత్రం వారే బలవంతంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు. ఈక్రమంలో 19, 20 తేదీల్లో చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి. మరోవైపు జూరాల నుంచి సాగునీరు అందించాలని 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, భాజపా నేతలపైనా కేసులు నమోదయ్యాయి.

## కరెంటు కష్టాలు కాంగ్రెస్ వల్లే

హైదరాబాద్(జనంసాక్షి):
తమ పంటలను కాపాడుకోవడం కోసం జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందించారు కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం అలవాటుగా మారిందని విమర్శించారు. వారి చేతగానితనంవల్ల పంటలకు నీరందకపోతే కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా..? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. ఇది ప్రజా పాలన కాదని, ప్రజా పీడన అని విమర్శించారు. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా..? అని నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హరీష్‌రావు హెచ్చరించారు.

## తెలంగాణలో కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది దరఖాస్తు

కొన్ని రోజులుగా రాజకీయ వివాదం కొనసాగుతోంది. వివాదం నెలకొన్న ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫామ్-7లు రాగా... అందులో 87 తొలగించినట్లు సీఈవో కార్యాలయం తెలిపింది. గోషామహల్‌లో 222 దరఖాస్తులు రాగా 87 తొలగించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి 6,335 ఫామ్-7లు అందగా.. ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు కొత్తగా ఓటు నమోదు కోసం రాష్ట్రంలో అత్యధిక ఫామ్-6లు హైదరాబాద్ జిల్లాలోనే వచ్చినట్లు సీఈవో కార్యాలయం వెల్లడించింది.

# జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్ కేవలం భౌగోళికంగా అనుకూలమైన నగరం మాత్రమే కాదని, టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్ జీఎస్టీ పరిపాలనకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల జీఎస్టీ పరిపాలన రాష్ట్రాలకు మరింత చేరువ కావడంతో పాటు, సాంకేతికత ఆధారిత పన్ను మోసాల గుర్తింపు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారుసరుకుల వాహనాల తనిఖీల విషయంలో ప్రస్తుతం ఉన్న అధికారాలను మూల రాష్ట్రం, గమ్య రాష్ట్రం రెండింటికీ కొనసాగించాలని తెలంగాణ సూచించింది. పన్ను ఎగవేతను అరికట్టడంతో పాటు, వ్యాపార కార్యకలాపాలకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సమతుల్య విధానం అవసరమని భట్టి పేర్కొన్నారు. తెలంగాణ వంటి ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని భట్టి కోరారు. పోటీతో కూడిన ఎగుమతి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలు, ప్రజా ప్రయోజనాల కోసం పెట్టుబడులు పెట్టే రాష్ట్రాలకు తగిన మద్దతు, ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్సులలో రాష్ట్రాలకు నిర్దిష్టమైన, పారదర్శక వాటా కల్పించాలని కోరారు.

## పన్ను అధికారులకు అరెస్టు అధికారం రద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్ 57వ సమావేశం ముగిసింది. పన్ను అధికారులకున్న అరెస్టు అధికారాన్ని జీఎస్టీ మండలి రద్దు చేసింది. ప్రాసిక్యూషన్ పరిమితిని కూడా రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం నిర్ణయాలను ఆర్థిక మంత్రి మీడియాకు వెల్లడించారు. జీఎస్టీ రేట్లలో ఈసారి ఎలాంటి మార్పులూ చేయలేదు. “రేట్ల అంశం ఇప్పటికే ఖరారైంది. రోజువారీ అంశాలపై కౌన్సిల్ ఈ సారి దృష్టి సారించింది. ఏడాదికి ఒకసారి జీఎస్టీ రేట్లలో మార్పులు జరుగుతాయి” అని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌ల అంశాన్ని పరిశీలించేందుకు ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సప్లయర్‌కు పూర్తి మొత్తం చెల్లించి ఉత్పత్తులు, తగిన ఇన్‌వాయిస్‌లు కలిగిన బయ్యర్లను ఎలా రక్షణ కల్పించాలనే దానిపై ఆఫీసర్లు మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తామని తెలిపారు. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పై చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చేలా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇ-కామర్స్‌లో విక్రయించే చిరు వ్యాపారుల రిజిస్ట్రేషన్ మెకానిజాన్ని సులభతరం చేశారు. అలాగే, సాధారణ జరిమానాను రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించారు.

## ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే నానా పటేకర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా ఆయన మరణించినట్లు తెలిపారు. నటుడిని కాపాడేందుకు సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. పటేకర్ మృతిపై పోలీసులు మెడికో లీగల్ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలియనున్నాయని పోలీసులు వెల్లడించారు నానా పటేకర్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. ఆయన నటించిన కొన్ని సినిమాలు తెలుగులోకి డబ్ అయ్యి ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రజనీకాంత్ హీరోగా వచ్చిన ‘కాలా’ సినిమాలో విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే, తమిళంలో భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన ‘బొమ్మలాట్టమ్’ సినిమా తెలుగులో ‘రాణా’ పేరుతో డబ్ అయ్యింది. ఇందులో అర్జున్, కాజల్ అగర్వాల్‌తో పాటు నానా పటేకర్‌ముఖ్య పాత్ర పోషించారు. 1951లో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978 లో ‘గమన్’ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. తన కెరీర్‌లో మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్నారు. ‘క్రాంతి వీర్’ సినిమాకు ఉత్తమ నటుడిగా, పరిందా, అగ్నిసాక్షి చిత్రాలకు ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు దక్కింది. సినీ పరిశ్రమకు అందించిన సేవలకు గానూ 2013లో కేంద్రం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అదే ఏడాది మహారాష్ట్ర ప్రభుత్వం రాజ్‌కపూర్ ప్రత్యేక సహకార అవార్డును ప్రదానం చేసింది.

### నానా పటేకర్ మృతిపై ప్రముఖుల సంతాపం

ప్రముఖ నటుడు నానా పటేకర్ ఆకస్మిక మరణంపై సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులుగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. తరాలు గుర్తుంచుకునే పాత్రలతో నానా పటేకర్ అభిమానులను మెప్పించారని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. “నానా పటేకర్ లాంటి నటులు చాలా తక్కువ మంది ఉంటారు. ప్రతి పాత్రలోనూ ఆయన వైవిధ్యం ప్రదర్శించేవారు. తరాల పాటు గుర్తుండిపోయే పాత్రలను మనకు అందించారు. తన భావాలను నిస్సంకోచంగా, స్పష్టంగా చెబుతూ ఎంతో మంది అభిమానాన్ని పొందారు. హిందీ, మరాఠీ సినిమాలకు ఎంతో సేవ చేశారు. ఆయన మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటు. పటేకర్ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నాను”అని ప్రధాని మోదీ అన్నారు. “నా మిత్రుడు నానాజీ ఇక లేరంటే నమ్మలేకపోతున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను” అని ప్రధాని రజనీకాంత్ అన్నారు. “నానాపటేకర్ మరణం విచారకరం. తెరపై అద్భుతమైన నటనతో, తనదైన ప్రత్యేక కళా ప్రస్థానంతో భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన ఒక అసాధారణ నటుడు ఆయన. రైతులపై ప్రేమ, తెర వెనుక తన ఫౌండేషన్ ద్వారా అందించిన సేవ ఆయన మంచితనాన్ని ప్రతిబింబిస్తాయి. నానాజీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను” చిరంజీవి అన్నారు. “భారతీయ సినిమా దిగ్గజం నానా పటేకర్. ఆయన సేవ, వారసత్వం తరతరాల పాటు నిలిచి ఉంటాయి” విరాట్ కోహ్లీ అన్నారు.




## ఎండీఆర్ ఛార్జీల అమలు జనవరికి వాయిదా..?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు అమలు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. అక్టోబర్ 15వ తేదీకి బదులు జనవరి 1 నుంచి అమలు చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే పండుగల సీజన్‌లో వ్యాపారులకు ఊరట కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనం రాసింది. ఈ నేపథ్యంలో నేటి ట్రేడింగ్ సెషన్‌లో పేమెంట్ అగ్రిగేటర్ల షేర్లు క్షీణించాయి. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇటీవల ‘నో యూపీఐ డే’ పేరిట నిరసన తెలిపారు. ముఖ్యంగా పండగ సీజన్‌లో ఎండీఆర్ ఛార్జీల వల్ల ఖర్చులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఛార్జీల అమలును తాత్కాలికంగా వాయిదా వేయాలని ఎన్‌పీసీఐ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికితోడు వార్షిక టర్నోవర్ రూ.40 లక్షల వరకు ఉన్న వ్యాపారాలకు కూడా ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని కమిటీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఎండీఆర్ ఛార్జీలు వాయిదా వేస్తారన్న వార్తల నేపథ్యంలో పేమెంట్ అగ్రిగేటర్ల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్ షేరు దాదాపు 10 శాతం మేర పతనమైంది.

## రెండో రోజూ జగ్గారెడ్డి దంపతుల దీక్ష



- సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు, ప్రజా సంఘాలు

**సంగారెడ్డి అక్టోబర్ 08 (జనం సాక్షి)** : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి చేపట్టిన దీక్ష రెండో రోజూ కొనసాగింది. బుధవారం ప్రారంభించిన దీక్షలో భాగంగా రాత్రింబవళు దీక్షా శిబిరంలోనే ఉంటూ నిరసన తెలిపారు. జగ్గారెడ్డి దంపతుల దీక్షకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంగారెడ్డి ప్రజలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి జగ్గారెడ్డి దంపతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. ఆయన చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ఉద్యమం కొనసాగినంత కాలం తాము కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దేశ ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీకి ప్రజలంతా అండగా నిలవాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలోనూ రానున్న రోజుల్లో సంఘీభావ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, జగ్గారెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా బతుకమ్మ సందడి

- ప్రతి ఆడబిడ్డ ఆనందంగా బతుకమ్మ జరుపుకోవాలి
- పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి : మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి)** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా, ఆనందంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతితో దానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలంగాణ బిడ్డలు బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సందర్భంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని, పూలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కలిపి జరుపుకునే ప్రత్యేకమైన పండుగ అని పేర్కొన్నారు. "బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన ప్రకృతితో ముడిపడిన పండుగ. ప్రతి ఆడబిడ్డ ఆనందంగా.. ప్రతి కుటుంబం సంతోషంగా.. ప్రతి గ్రామం సురక్షితంగా బతుకమ్మ జరుపుకునేలా ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని మంత్రి సీతక్క తెలిపారు.

### రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు

బతుకమ్మ పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్ల సమన్వయంతో పనిచేసి పండుగకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గ్రామాలు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు, చెరువులు, కుంటలు, ఘాట్‌ల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బతుకమ్మ ఆడే ఘాట్‌లకు వెళ్లే మార్గాలను పూర్తిగా శుభ్రం చేయాలని, రహదారులపై గుంతలు ఉంటే వెంటనే పూడ్చాలని సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు ఉండేలా అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఘాట్‌ల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉంటే తొలగించాలని ఆదేశించారు. బతుకమ్మ వేదికలను ముందుగానే శుభ్రం చేసి సిద్ధం చేయాలని, అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బతుకమ్మ ఘాట్‌లకు సరైన రహదారి సౌకర్యం లేని ప్రాంతాల్లో వీబీజీ రామ్ జీ పథకం కింద మట్టి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ సేవలు సులభంగా అందించేలా చర్యలు

- ప్రజలు నేరుగా వాట్సాప్ లో ఫిర్యాదులు చేసే అవకాశం
- మంత్రి జూపల్లి ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్
- మంత్రి పేషీ, కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక వాట్సాప్ నంబర్లు
- ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న మంత్రి జూపల్లి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08 (జనంసాక్షి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో ప్రభుత్వ సేవలపై ఫిర్యాదులకు ఇకపై ఎక్కడికి తిరగాల్సిన అవసరం లేకుండా సరికొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కలెక్టర్లకు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4 కలెక్టరేట్లలో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను (ప్రత్యేక గ్రీవెన్స్ సెల్) ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా వాట్సాప్ సేవలను కలెక్టర్లు అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ లోని మంత్రి జూపల్లి పేషిలోనూ ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు పేషీ: 8500689596, ఆదిలాబాద్ కలెక్టరేట్: 9492341947, నిర్మల్ కలెక్టరేట్: 8317557897, కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్: 7569986036, మంచిర్యాల కలెక్టరేట్: 9492123642 ప్రజలు ఈ వాట్సాప్ నంబర్లను వినియోగించుకుని తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సత్వర పరిష్కారం పొందాలని మంత్రి కోరారు. ఉమ్మడి జిల్లా ప్రజలు తమ ఫిర్యాదులను వాట్సాప్ నంబర్లకు మెసేజ్ రూపంలో పంపవచ్చని కలెక్టర్లు తెలిపారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫోటోలు పంపించాలని సూచించారు.

## నీళ్లడిగిన రైతులపై కేసులు నమోదు చేస్తారా?

- సాగునీరు ఇవ్వడం చేతకాక రైతులపై కేసులు పెట్టడం దారుణం: మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 08 (జనంసాక్షి)** : పంటలు ఎండిపోతున్నాయని సాగునీటి కోసం జూరాల ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని విడుదల చేసిన రైతులపై రహస్యంగా కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు గేట్లు తెరిచిన ఘటనపై డీఈతో ఫిర్యాదు చేయించి గత నెల 20న కేసులు నమోదు చేయడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి, నీళ్ల కోసం ప్రశ్నించిన రైతులపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

### 14 మంది రైతులపై కేసులు ఎత్తివేయాలి

కృష్ణారెడ్డి, రాజు, కురుమూర్తి, గోపి, జబ్బార్, షరీఫ్, శేఖర్‌రెడ్డి, దేవేందర్, సమరసింహ, సద్దల భాను, వేణు, భాస్కర్, లక్ష్మణ్, నరేష్‌లపై నమోదైన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులపై కేసులు పెట్టడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, వారికి అవసరమైన సాగునీటిని అందించడమే ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కర్ణాటకకు రెండు రోజుల పాటు ప్రభుత్వ ఖర్చుతో వెళ్లి అక్కడి నుంచి నీటిని తీసుకొస్తామని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం చివరకు ఏం సాధించిందని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కర్ణాటక నుంచి నీటిని తీసుకురాలేకపోయినా, మరోవైపు తమ పంటలను కాపాడుకునేందుకు నీటి కోసం ప్రయత్నించిన రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలనలో విద్యుత్ బిల్లులు చెల్లించలేదనే కారణంతో ఒక్క గట్టు మండలంలోనే రైతులపై సుమారు మూడు వేల కేసులు నమోదు చేశారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఎదుర్కొన్న రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం సాగునీరు అందించకుండా రైతుల పొలాలు ఎండబెట్టి, సమస్యను పరిష్కరించకుండా రైతులపై కేసులు నమోదు చేయడం కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో తీవ్ర ప్రతికూల ఫలితాలకు దారితీస్తుందని హెచ్చరించారు. రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేసి, జూరాల నీటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డబ్బులు లాక్కొని దాడి

- ముగ్గురిపై కేసు

**గీసుకొండ, అక్టోబర్ 8, (జనం సాక్షి)** : కోర్టు కేసుకు సంబంధించిన ఖర్చుల విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిని బెదిరించి రూ.లక్ష నగదు తీసుకోవడంతోపాటు భౌతిక దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదుపై గీసుగొండ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన చీర్ల ఉమారెడ్డి (59)కి, ఆయన తమ్ముడు చీర్ల మల్లారెడ్డికి మధ్య కోర్టు కేసు ఖర్చుల విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో ధర్మారం గ్రామానికి చెందిన సుంకరి శివ ఇంటి వద్ద పంచాయతీ నిర్వహించారు. కోర్టు కేసుకు సంబంధించిన డబ్బులను మల్లారెడ్డికి ఇవ్వాలని శివ కోరగా ఉమారెడ్డి నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో శివ బెదిరించి బలవంతంగా రూ.1 లక్ష తీసుకున్నట్లు ఉమారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ప్లాస్టిక్ కుర్చీతో ముఖంపై, టీపాయ్‌తో కుడి కాలిపై కొట్టినట్లు ఆరోపించారు. అలాగే మల్లారెడ్డి, ఆయన కుమారుడు రాజిరెడ్డి తనను దూషిస్తూ ఛాతిపై చేతులతో కొట్టి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు సుంకరి శివ, చీర్ల మల్లారెడ్డి, చీర్ల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు గీసుగొండ సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపారు. ఘటనకు సంబంధించిన సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

## ఎల్‌నినో ప్రభావం ఉంది

- యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎల్ నినో ప్రభావం వల్ల యాసంగి సీజన్ లో నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో యాసంగి పంటల సాగు కార్యాచరణ ప్రణాళికపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి సాగుపై ఆధారపడకుండా జొన్న, మినుములు, పెసర్లు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. భూములు బీడుగా ఉండకుండా పప్పుధాన్యాలు, కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రామస్థాయిలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి సాగు ప్రణాళికపై సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

జిల్లాలో రైతు నమోదు, పంట సర్వే ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని, యూరియా పంపిణీలో సమస్యలపై నివేదిక సమర్పించాలని తెలిపారు. అనంతరం నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి నానో ఎరువుల వాడకంతో దిగుబడులు పెరిగి, రైతులకు ఖర్చు తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులు గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఉద్యాన శాఖ అధికారి తిరుపతి, ఏడీలు శ్రీపాల్, రమేష్, కోరమండల్ అగ్రోనమిస్ట్ వినోద్, మార్కెటింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై నాన్ బెయిలబుల్ కేసులా?

- ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్ (జనంసాక్షి)** : జూరాల నీటి విడుదల కోసం పోరాటం చేసిన రైతులు, రైతుల పక్షాన నిలిచిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతారా? అంటూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ మండిపడ్డారు. గురువారం మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆమె రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు సాగునీరు విడుదల చేయాలని కోరితే.. నీరు విడుదల చేయకుండా ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేసిందని ఆమె ప్రశ్నించారు. కర్ణాటకకు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి పెద్ద డ్రామా చేశారని విమర్శించారు. వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలతో నీరు వస్తే.. ఆ నీటిని కర్ణాటక నుంచి విడుదల చేయించామని మంత్రులు, ఎమ్మెల్యేలు జూటా మాటలు మాట్లాడారని ఆరోపించారు. కర్ణాటక నుంచి ఒక్క చుక్క నీటిని కూడా విడుదల చేయించలేకపోయారని ఆమె విమర్శించారు. పంటలు ఎండిపోకుండా రెండో తడికి నీరు అవసరమని, జూరాలలో నీరు అందుబాటులో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడితే డ్యామ్‌పై ధర్నాలు, నిరసనలు చేయకుండా, నీరు అడగకుండా రైతులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "మీ తాటాకు చప్పుళ్లకు భయపడేవాళ్లు ఎవరూ లేరు. వెంటనే జూరాల నుంచి లెఫ్ట్, రైట్ కెనాల్స్ ద్వారా పంటలకు నీరు ఇవ్వాల్సిందే" అని ఎంపీ అరుణ ప్రభుత్వాన్ని నిలదీశారు.

## ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఐజేయూ నుంచి ముగ్గురికి సభ్యత్వాలు

- జాతీయ స్థాయిలో ఐజేయూకు దక్కిన గౌరవం : అల్లం నారాయణ, ఆస్కాని మారుతి సాగర్







**హైదరాబాద్ (జనంసాక్షి)** : ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సభ్యులుగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఐజేయూ అధ్యక్షుడు గీతార్థ్ పాఠక్ (అస్సాం), ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ కోహ్లీ (చండీగఢ్), అదే యూనియన్‌కు చెందిన సభ్యుడు బిజాయ్ కే (మణిపూర్)లను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులుగా నామినేట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-హెచ్-143) వంటి బలమైన సంఘంతో పాటు 21 రాష్ట్రాల జర్నలిస్టు యూనియన్లతో కలిసి జాతీయ స్థాయిలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐజేయూ నిరంతరం కృషి చేస్తోందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి, ఐ జె యు కోశాధికారి ఆస్కాని మారుతి సాగర్ పేర్కొన్నారు. ఐజేయూ నుంచి ముగ్గురికి ప్రెస్ కౌన్సిల్ సభ్యత్వాలు లభించడం యూనియన్‌కు దక్కిన గౌరవంగా వారు అభివర్ణించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులుగా నామినేట్ అయిన వారు జర్నలిస్టుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, మీడియా స్వేచ్ఛను కాపాడే దిశగా చొరవ చూపాలని వారు ఆకాంక్షించారు. కొత్తగా సభ్యులుగా నామినేట్ అయిన అందరి సభ్యులతో పాటు ప్రత్యేకంగా ముగ్గురికి తెలంగాణ జర్నలిస్టుల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## పాల ఉత్పత్తి, దిగుబడిలో ముందంజలో నిలవాలి

- పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు
- విజయ డెయిరీ, ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 8 (జనంసాక్షి)** : జిల్లాలో పాల ఉత్పత్తి, దిగుబడిలో ముందంజలో నిలిపేవిధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పై జిల్లా పశు సంవర్ధక శాఖ, సహకార, పరిశ్రమల శాఖ, విజయ డెయిరీ, మెప్మా, ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పశుసంపద, పాల దిగుబడి, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో పాల దిగుబడి తక్కువగా ఉందని రానున్న రోజుల్లో దిగుబడి శాతం పెరిగేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడి రంగం బలోపేతానికి పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి, పాడి పరిశ్రమ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పాలు, పాల ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి మరిన్ని విజయ తెలంగాణ అవుట్ లెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

### శిరిడీ సాయిబాబా ఆలయంలో అన్నదానం

## వైద్య సేవలకు రూ.2 లక్షల విరాళం



**హైదరాబాద్ (జనంసాక్షి)** : శిరిడీ సాయిబాబా ఆశీస్సులతో నేడు పవిత్రమైన శిరిడీ సాయిబాబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో అన్నదానం, వైద్య సేవల కోసం ఫ్రాజజ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.2,00,000 విరాళంగా అందజేశారు. అనంతరం శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, శిరిడీ సీఈవో గోరక్ష్ గాడిల్కర్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానం, వైద్య సేవలకు తమ వంతు సహకారం అందించడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మికంగా సంతృప్తినిచ్చిన సందర్భమని పేర్కొన్నారు. సాయిబాబా కృప, ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేయాలని, సేవా భావం, మానవత్వం, కరుణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్లాస్టిక్ వాడొద్దు అని జూట్ బ్యాగులను వాడాలి అనే ఉద్దేశంతో జూడ్ బ్యాగులను ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం మీడియా తో ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ "సేవే సాయిసేవ.. మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తమకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్న, కుమారుడు సాయి కిరణ్, కోడలు శార్వరి, చిన్న కుమారుడు సాయి తేజ, చిన్న కోడలు వైష్ణవి పాల్గొన్నారు.



### ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

నేను అనగా బోయిని శ్రీను తండ్రి ఆశన్న ఇంటి.నెం.1-70/1, గ్రామం ఏర్పుమళ్ళ, మం॥ బొంరాస్ పేట్, జిల్లా వికారాబాద్. నా ఆటో నంబర్ □□□□□□□□□□□ కు సంబంధించి ఒరిజినల్ RC,NOC తేదీ:23/09/2026 రోజు తుంకిమెట్ల సమీపంలో పోయినవి. అట్టి ఒరిజినల్ పేపర్లు దొరికిన వారు ఫోన్:9666728278 నంబరుకు కాల్ చేసి తెలపగలరు.

# అధికార పక్షానికి ఎందుకు వత్తాసు..!?

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న అత్యంత విలువైన హక్కుల్లో నిరసన తెలిపే హక్కు ఒకటి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, రాజ్యాంగ సంస్థల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేయడం, తమ అభ్యంతరాలకు సమాధానం కోరడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం కాదు. అదే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తినప్పుడు ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా అదే రాజ్యాంగ సంస్థలపై ఉంటుంది.

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాలు చేస్తున్న ఆందోళనలను ఈ కోణంలోనే చూడాలి. ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించడం రాజ్యాంగ సంస్థపై దాడి కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన వారినే తప్పుబట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అసలు ప్రశ్న ఒక్కటే. ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి రాజ్యాంగం, చట్టాలు కల్పించాయా? ఉంటే ఆ అధికారానికి సంబంధించిన నిబంధనలు ఏమిటి? ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతానికి ఎలాంటి హామీ ఉంది? ప్రజల్లో తలెత్తుతున్న ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సింది ఎన్నికల సంఘమే. ప్రజల సందేహాలను నివృత్తి చేయడం ద్వారా సంస్థ బలహీనపడదు. మరింత బలపడుతుంది.

ఇలాంటి సమయంలో 42 మంది విశ్రాంత న్యాయమూర్తులు బహిరంగ లేఖ రాసి ఎన్నికల సంఘానికి మద్దతు పలకడం కూడా చర్చకు దారితీసింది. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను కాపాడాలనే పేరుతో ప్రశ్నించే గొంతులను నిరుత్సాహపరిచే వాతావరణం ఏర్పడకూడదు. న్యాయమూర్తులు పదవిలో ఉన్నా, విరమించినా వారి తటస్థత, స్వతంత్రతే వారి గౌరవానికి పునాది. ఇదే సందర్భంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యవహారం గుర్తుకు రాకమానదు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పోటీ చేసిన సమయంలో, ఆయన ఇచ్చిన సాల్వా జుడుం తీర్పును ప్రస్తావిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఒక న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని ఆయన వ్యక్తిత్వాన్ని, న్యాయపరమైన నిర్ణయాలను రాజకీయ విమర్శలకు గురిచేయడం న్యాయవ్యవస్థ స్వతంత్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఆ సమయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా న్యాయవర్గాల నుంచి, మాజీ న్యాయమూర్తుల నుంచి గొంతులు వినిపించాయి. అదే సమయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచిన కొందరు న్యాయమూర్తుల వైఖరి కూడా ప్రజల దృష్టికి వచ్చింది. అధికారంలో ఉన్న ఒక రాజకీయ నాయకుడి వ్యాఖ్యలకు మద్దతుగా న్యాయమూర్తులు ఎందుకు నిలబడాల్సి వచ్చింది? ఒక న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుపై రాజకీయ విమర్శలు వచ్చినప్పుడు, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? అమిత్ షా వైపు నిలిచిన ఆ న్యాయమూర్తులు ఎందుకు అలా నిలిచారన్నది పౌర సమాజం అర్థం చేసుకోగలదు.

న్యాయవ్యవస్థ స్వతంత్రత అనేది కేవలం పదవిలో ఉన్న న్యాయమూర్తులకే సంబంధించిన అంశం కాదు. న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు నచ్చకపోతే దాన్ని చట్టపరమైన మార్గంలో సవాలు చేయవచ్చు. కానీ ఒక తీర్పును రాజకీయ వేదికపైకి తీసుకువచ్చి న్యాయమూర్తినే రాజకీయ విమర్శలకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అన్నది ప్రశ్నించాల్సిందే. అధికారాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహం కాదు. ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తే ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి మాట్లాడితే అది ఎవరికైనా వ్యతిరేకత కాదు. రాజ్యాంగ సంస్థలు ప్రజల విశ్వాసంతోనే నిలబడతాయి. ఆ విశ్వాసాన్ని కాపాడేది విమర్శలను అణచివేయడం కాదు.. విమర్శలకు సమాధానం చెప్పే ధైర్యం. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారికి జవాబుదారీతనం ఎంత అవసరమో, రాజ్యాంగ సంస్థలకు కూడా అంతే అవసరం. ఎవరు అధికారంలో ఉన్నా, ఏ సంస్థ అయినా ఒకే ప్రమాణం వర్తించాలి.

ప్రజలను ప్రశ్నించకుండా చేయడం ప్రజాస్వామ్యం కాదు. ప్రజలు ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పగలగడమే నిజమైన ప్రజాస్వామ్యం. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను కాపాడాలంటే వాటి చుట్టూ నిశ్శబ్దాన్ని నిర్మించడం కాదు.. వాటి నిర్ణయాలకు ప్రజల ముందు జవాబుదారీతనాన్ని నిర్ధారించడమే అసలైన రక్షణ.

# ఆధిపత్య రాజకీయ వ్యవస్థ కొనసాగుతుందా!

**భారతదేశం స్వాతంత్ర్యం పొందిన 1947 నుంచి 2026 వరకు రాజకీయ వ్యవస్థ అనేక పరిణామాలను చూసింది. స్వాతంత్ర్య ఉద్యమ నాయకత్వం, రాజ్యాంగ విలువలు, ప్రజాసేవా దృక్పథం, సిద్ధాంత రాజకీయాలు ఒక దశలో ప్రధాన ఆధారాలుగా నిలిచాయి. అయితే కాలక్రమేణా సిద్ధాంతం కంటే అధికార సాధన, ప్రజాసేవ కంటే ఎన్నికల విజయం, సంస్థాగత నాయకత్వం కంటే వ్యక్తి ఆధిపత్యం, ప్రజా సమస్యల కంటే గుర్తింపు రాజకీయాలు, విధాన చర్చల కంటే ప్రచార రాజకీయాలు ప్రాధాన్యం పొందినట్లు రాజకీయ పరిశోధనలు సూచిస్తున్నాయి.**

రాజకీయ విలువల క్షీణత ఒకే తేదీన లేదా ఒకే ప్రభుత్వ కాలంలో జరగలేదు. 1970లలో అధికార కేంద్రీకరణ, 1980లలో ధనబలం-నేరబలం, 1990లలో కుల-మత-ప్రాంతీయ సమీకరణాలు, ఆర్థిక ఉదారీకరణ, 2000లలో నేరీకరణ-ఎన్నికల వ్యయం, 2010లలో వ్యక్తికేంద్రిత ప్రచారం-డిజిటల్ రాజకీయాలు ఈ మార్పులో కీలక దశలుగా నిలిచాయి.

**స్వాతంత్ర్యానంతర తొలి దశ: 1947--1967 :** 1947 నుంచి 1967 వరకు భారత రాజకీయ వ్యవస్థపై స్వాతంత్ర్యోద్యమ వారసత్వం బలంగా కనిపించింది. 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. 1951-52లో తొలి సాధారణ ఎన్నికలు జరిగాయి. అప్పటి నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాట అనుభవం ఉన్నవారు పెద్ద సంఖ్యలో ఉండటం, రాజకీయాన్ని ప్రజాసేవగా చూడటం, సిద్ధాంతాల ఆధారంగా పార్టీలు పనిచేయడం కనిపించాయి. 1951-52 తొలి లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 17.3 కోట్ల మంది ఓటర్లు నమోదయ్యారు. ఆ కాలంలో ఎన్నికలు ప్రధానంగా పార్టీ సంస్థాగత బలంపై ఆధారపడి ఉండేవి. 1967 ఎన్నికలు కీలక మలుపుగా నిలిచాయి. అనేక రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు అధికారంలోకి రావడంతో పోటీ విస్తరించింది. అదే సమయంలో పార్టీలలో అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు పెరిగాయి.

**1967-1977: అధికార కేంద్రీకరణ**

1967 తర్వాత నాయకత్వం, పార్టీ సంస్థ, రాష్ట్ర రాజకీయాలు, కేంద్ర అధికారాల మధ్య సంబంధాలు మారాయి. 1969లో కాంగ్రెస్‌లో విభజనతో పార్టీ సంస్థ కంటే వ్యక్తికేంద్రిత నాయకత్వం ప్రాధాన్యం పొందుతున్నదనే విశ్లేషణలు బలపడ్డాయి. 1971లో "గరీబీ హటావో" వంటి నినాదాలు నాయకత్వకేంద్రిత ప్రచారానికి ఉదాహరణగా నిలిచాయి. 1975 జూన్ 25న అత్యవసర పరిస్థితి ప్రకటించబడింది. 1975-77లో పౌర స్వేచ్ఛలు, పత్రికా స్వేచ్ఛ, రాజకీయ ప్రతిపక్షం, ప్రభుత్వ అధికారాల పరిమితులపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తాయి. 1977 ఎన్నికల్లో అధికార మార్పిడి జరగడం ద్వారా ఎన్నికల ద్వారా ప్రజలు ప్రభుత్వాన్ని మార్చగల సామర్థ్యం వెల్లడైంది.

**1980లు-1990లు: ధనబలం, నేరబలం, సామాజిక సమీకరణాలు**

1980లలో రాజకీయ పోటీ విస్తరించడంతో ఎన్నికల ఖర్చు పెరిగింది. కులం, ప్రాంతం, మతం, స్థానిక ప్రభావం, వ్యాపార సంబంధాలు ఎన్నికల విజయానికి ప్రాధాన్యం పొందాయి. రాజకీయాల్లో నేరపూరిత నేపథ్యం కలిగిన వ్యక్తుల ప్రవేశంపై ఆందోళనలు పెరిగాయి. 1993లో వోహ్రా కమిటీ నివేదిక రాజకీయ-నేర సంబంధాలపై తీవ్రమైన ఆందోళనలను నమోదు చేసింది. 1990లలో మండల్ కమిషన్ సిఫారసుల అమలుతో కులాధారిత రాజకీయ సమీకరణాలు బలపడ్డాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతర పరిణామాలు మతపరమైన రాజకీయ సమీకరణాలకు ప్రాధాన్యం తెచ్చాయి. 1991 ఆర్థిక ఉదారీకరణతో ప్రభుత్వ పాత్ర, ప్రైవేటు రంగం, మార్కెట్, కార్పొరేట్ రంగం, పెట్టుబడుల ప్రాధాన్యం పెరిగింది. దీంతో రాజకీయ నిధుల స్వరూపం కూడా మారింది. 1999లో అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం, 2002-2003లో సుప్రీంకోర్టు తీర్పులు ఎన్నికల అభ్యర్థుల నేర, ఆస్తి, విద్యా వివరాల వెల్లడికి దారితీశాయి. దీంతో 1990ల దశ రాజకీయ విలువల మార్పులో ప్రధాన నిర్మాణాత్మక మలుపుగా నిలిచింది.



**2000-2024: గణాంకాల్లో కనిపించిన మార్పు**

లోక్‌సభలో నేర కేసులు ప్రకటించిన ఎంపీల శాతం 2004లో 24%, 2009లో 30%, 2014లో 34%, 2019లో 44%, 2024లో 46%గా నమోదైంది. 2024లో 543 మంది ఎంపీలలో 251 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు, 170 మంది తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు ప్రకటించారు. ఇవి కోర్టు ద్వారా దోషులుగా తేలిన వారిని సూచించవు; ప్రకటించిన పెండింగ్ క్రిమినల్ కేసులు మాత్రమే. ధనబలంలోనూ పెరుగుదల కనిపించింది. 2009లో కోటీశ్వర అభ్యర్థులు 16% ఉండగా, 2014లో 27%, 2019లో 29%, 2024లో 31%కి పెరిగారు. 2024లో విశ్లేషించిన 8,337 మంది అభ్యర్థుల్లో 2,572 మంది రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులు ప్రకటించారు. లోక్‌సభ విజేతల్లో కోటీశ్వరుల శాతం 2009లో 58% నుంచి 2014లో 82%, 2019లో 88%, 2024లో 93%కి పెరిగింది. 2024లో 543 మందిలో 504 మంది రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులు ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి అవసరమైన ఆర్థిక సామర్థ్యం పెరుగుతున్నదా అనే ప్రశ్నను ఈ గణాంకాలు ముందుకు తెస్తున్నాయి.

**వ్యక్తికేంద్రిత రాజకీయాలు**

2010 తర్వాత సామాజిక మాధ్యమాల విస్తరణ రాజకీయ ప్రచారాన్ని మార్చింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, వాట్సాప్ వంటి వేదికలు నాయకులకు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించాయి. అయితే పార్టీ కంటే నాయకుడి వ్యక్తిగత బ్రాండ్ ప్రాధాన్యం పెరిగింది. 2014 తర్వాత బలమైన నాయకత్వం చుట్టూ ప్రచారం, సామాజిక మాధ్యమాల విస్తృత వినియోగం, రాజకీయ సందేశాల కేంద్రీకరణ కొత్త రాజకీయ శైలికి బలాన్నిచ్చాయి. ఈ ధోరణి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాదు. 2017లో ఎన్నికల బాండ్ల పథకం రాజకీయ నిధుల విషయంలో కొత్త దశను ప్రారంభించింది. 2024 ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు ఈ పథకం, దానికి సంబంధించిన కొన్ని చట్ట సవరణలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. దాతల వివరాలు వెల్లడించకపోవడం పౌరుల సమాచార హక్కుతో సంబంధం కలిగి ఉందని కోర్టు పేర్కొంది.

**అధిపతి రాజకీయ వ్యవస్థ ఎందుకు ఏర్పడుతుంది?**

అధిపతి రాజకీయ వ్యవస్థ ఒక వ్యక్తి వల్ల మాత్రమే ఏర్పడదు. పార్టీలలో అంతర్గత ఎన్నికలు బలహీనపడితే నాయకత్వం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. ఎన్నికల ఖర్చు పెరిగితే ఆర్థికంగా బలమైన అభ్యర్థులకు ప్రాధాన్యం పెరుగుతుంది. నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులు గెలిస్తే నేరీకరణకు ప్రోత్సాహం లభిస్తుంది. మీడియా నాయకుడి వ్యక్తిత్వాన్ని విధానాల కంటే ఎక్కువగా ప్రదర్శిస్తే వ్యక్తికేంద్రిత రాజకీయాలు బలపడతాయి. ప్రతిపక్షం బలహీనపడితే అధికార పక్షంపై పర్యవేక్షణ తగ్గుతుంది.

**అధిపతి రాజకీయ వ్యవస్థ కొనసాగుతుందా?**

భారత రాజకీయ వ్యవస్థలో విలువల క్షీణతను ఒకే సంవత్సరం, పార్టీ, నాయకుడు లేదా ప్రభుత్వంతో అనుసంధానించడం సరైంది కాదు. 1947 తర్వాత ప్రజాసేవ, స్వాతంత్ర్యోద్యమ వారసత్వం, సిద్ధాంత రాజకీయాలు ప్రధానంగా కనిపించగా, 1967 తర్వాత నాయకత్వ కేంద్రీకరణ పెరిగింది. 1975-77 అత్యవసర పరిస్థితి రాజ్యాంగ స్వేచ్ఛల పరిమితులను గుర్తుచేసింది. 1980లలో ధనబలం--నేరబలం, 1990లలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు వ్యవస్థ స్వరూపాన్ని మార్చాయి. 2000లలో ఇవి గణాంకాలతో కొలిచే స్థాయికి చేరగా, 2010లు--2020ల్లో డిజిటల్ రాజకీయాలు, వ్యక్తికేంద్రిత ప్రచారం, ధనబలం, మీడియా ప్రభావం కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి.

అయితే ఇది భారత ప్రజాస్వామ్యం ముగిసిందనే అర్థం కాదు. ఎన్నికలు, అధికార మార్పిడులు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నాయి. న్యాయవ్యవస్థ ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలిస్తోంది. పౌర సమాజం రాజకీయ వ్యవస్థపై అధ్యయనాలు చేస్తోంది. సమాచార హక్కు, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల వ్యయ నివేదికలు వంటి పారదర్శకతా సాధనాలు ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్నాయి. అందువల్ల అసలు ప్రశ్న అధికారం ఎంతవరకు వ్యక్తి చేతిలో కేంద్రీకృతమవుతుంది? సంస్థలు ఎంతవరకు స్వతంత్రంగా ఉంటాయి? రాజకీయ పార్టీలు ఎంతవరకు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటిస్తాయి? ఎన్నికలు ఎంతవరకు ధనబలం-నేరబలం నుంచి విముక్తమవుతాయి? ప్రజలు ఎంతవరకు చైతన్యవంతమైన పౌరులుగా వ్యవహరిస్తారు? అన్నదే.

రాజకీయ విలువలు నిలబడాలంటే నాయకులు మాత్రమే మారడం సరిపోదు. రాజకీయ పార్టీల నిర్మాణం, ఎన్నికల నిధుల వ్యవస్థ మారాలి. నేర నేపథ్యం ఉన్న అభ్యర్థుల ఎంపికపై పార్టీల బాధ్యత పెరగాలి. పార్లమెంటరీ చర్చలు బలోపేతం కావాలి. మీడియా, న్యాయవ్యవస్థ స్వతంత్రత రక్షించబడాలి. పౌర సమాజం చురుకుగా ఉండాలి. ముఖ్యంగా ఓటరు తన ఓటును వ్యక్తి అభిమానంతో కాకుండా విధానాలు, పనితీరు, ప్రజా ప్రయోజనం, రాజ్యాంగ విలువలు, జవాబుదారీతనం ఆధారంగా వినియోగించే రాజకీయ సంస్కృతి పెరగాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వ్యక్తి ఆధిపత్యం నుంచి సంస్థాగత ప్రజాస్వామ్యానికి, అధిపతి రాజకీయాల నుంచి రాజ్యాంగ రాజకీయాలకు, ఎన్నికల విజయం నుంచి ప్రజా జవాబుదారీతనానికి ప్రయాణిస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# బహుజన రాజ్య పోరాటయోధుడు కాన్షీరామ్

> డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అడుగుజాడల్లో బహుజన రాజ్యాధికార సాధన ధ్యేయంగా ఉద్యమించి భారత రాజకీయాలలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని బద్దలు కొట్టిన ధీరుడు, వీరుడు, బహుజన రాజ్య పోరాటయోధుడు కాన్షీరామ్. 'ఓట్లు మావి - సీట్లు మీవా? ఇకపై చెల్లదు! ఇకపై చెల్లదు!' అనే నినాదంతో ఆయన ప్రజానీకాన్ని ఎంతగానో ఆకట్టుకుని దేశ రాజకీయాల్లో సరికొత్త రాజకీయ శకానికి నాంది పలికారు. 'ఒక ఓటు - ఒక నోటు' అనే సరికొత్త నినాదంతో ఆయన ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేశారు.



పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లా ఖావాస్‌పూర్ గ్రామంలో సిక్కు కుటుంబంలో హరి సింగ్, బిషన్ కౌర్ దంపతులకు కాన్షీరామ్ 1934 మార్చి 15న జన్మించారు. ఆయన 1956లో బి.ఎస్‌సి డిగ్రీని అభ్యసించారు. కాన్షీరామ్ 1958లో పూణెలోని రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలటరీ ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థలో పరిశోధన అధికారిగా నియమితులయ్యారు. బుద్ధ మరియు అంబేద్కర్ జయంతులకు ప్రభుత్వం సెలవులను రద్దు చేయడాన్ని అదే సంస్థలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన దీనాబానా అనే ఉద్యోగి నిరసించారు. తత్ఫలితంగా ఆ ఉద్యోగిని ఉద్యోగం నుండి తొలగించడాన్ని కాన్షీరామ్ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతిమంగా ఆయన చేసిన చట్టబద్ధ పోరాటం వల్ల తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. అలాగే బుద్ధ మరియు అంబేద్కర్ జయంతులను సెలవులుగా రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వును ఉపసంహరించుకున్నారు.

ఆ ఘటనలు కాన్షీరామ్ జీవితాన్ని మరో మలుపు తిప్పాయి. క్రమంగా ఆయన తమ జాతి అభివృద్ధి కోసం పని చేయాలని బలంగా నిర్ణయించుకున్నారు. తన జాతి అభివృద్ధి కోసం పాటుపడిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల్ని సాధించేందుకు కాన్షీరామ్ కంకణబద్ధులై ఆ దిశగా తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఆ క్రమంలోనే కాన్షీరామ్ 1964లో తన ఉద్యోగానికి సైతం రాజీనామా చేశారు. 'బహుజన రాజ్య స్థాపన' లక్ష్యంగా నిర్దేశించుకుని 'బహుజన సమాజమే తన కుటుంబం' అని భావించి ఆయన అవివాహితుడుగానే ఉండిపోయారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన పుస్తకాలను కాన్షీరామ్ అధ్యయనం చేయడమే కాకుండా ఆయన ఆధ్వర్యంలో కొనసాగిన పోరాటాలను సునిశితంగా పరిశీలించారు. అలాగే మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, నారాయణ గురు, పెరియార్ రామస్వామి వంటి నాయకుల జీవితాలను మరియు వారు నిర్వహించిన పోరాటాలను ఆయన అధ్యయనం చేశారు. ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన 'కుల నిర్మూలన' పుస్తకం ఆయనను ఎంతగానో ప్రభావితం చేసింది.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలను బహుజన సమూహంగా మారిస్తే అధికారం చేజిక్కించుకోవడం సాధ్యమవుతుందని అవగతం చేసుకున్న కాన్షీరామ్ ఆ దిశగా తన ప్రయాణాన్ని కొనసాగించారు. క్రమంగా ఆయన అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని బహుజన ప్రజానీకంలోకి విస్తృతంగా తీసుకువెళ్లారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఉద్యోగులను ఏకం చేశారు.

'బోధించు, పోరాడు, సమీకరించు' అనే నినాదంతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సంఘాన్ని కాన్షీరామ్ 1971లో స్థాపించి యువతను, ఉద్యోగులను చైతన్యపరిచి దోపిడి నుండి, వేధింపుల నుండి మరియు కుల వివక్షత నుండి విముక్తి గావించే దిశగా ఉద్యమించారు. అదేవిధంగా బహుజన కులాల ఐక్యతకు పెద్దపీట వేస్తూనే 'విద్యావంతులై లబ్ధి పొందిన ఉద్యోగులు సమయం, సంపాదన మరియు ప్రతిభలో కొంత భాగాన్ని తిరిగి సమాజానికి అందివ్వడం మూలంగా వ్యవస్థను మార్చవచ్చు' అనే ఉద్దేశ్యంతో కాన్షీరామ్ 1978 డిసెంబర్ 6న 'బామ్‌సెఫ్' (వెనుకబడిన కులాల, మైనారిటీ ఉద్యోగుల సమాఖ్య)ను స్థాపించారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ)లో కాన్షీరామ్ పనిచేసినప్పటికీ ఆ పార్టీలో పొడచూపిన విభేదాల కారణంగా ఆయన ఆ పార్టీ నుండి బయటకు వచ్చారు. బహుజనులను రాజకీయ పోరాటాలలో భాగం చేసేందుకు గాను కాన్షీరామ్ 1981 డిసెంబర్ 6న దళిత్ సోషిత్ సమాజ్ సంఘర్షణ సమితి (డి.ఎస్.ఎస్.ఎస్)ను స్థాపించారు.

ఆయన కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 'సైకిల్ ర్యాలీ' నిర్వహించి ప్రజలలోకి 'సామాజిక పరివర్తన' దిశగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను తీసుకెళ్లారు. 1982లో జరిగిన హర్యానా, ఢిల్లీ, పంజాబ్ మరియు జమ్మూకశ్మీర్ ఎన్నికలలో దళిత్ సోషిత్ సమాజ్ సంఘర్షణ సమితి పాల్గొని నాలుగవ స్థానాన్ని సాధించింది.

ఆ క్రమంలోనే కాన్షీరామ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి)ని స్థాపించారు. 'తరచూ ఎన్నికలు రావాలి అని, తద్వారా ఆయా ఎన్నికల్లో తమ ఓట్ల శాతం, సీట్ల శాతం మెరుగుపరచుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి' అని బి.ఎస్.పి ఒక విధానంగా రూపొందించుకుంది.

క్రమంగా భారతీయ జనతా పార్టీ మద్దతుతో కుమారి మాయావతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించి దేశంలో 'తొలి దళిత మహిళా ముఖ్యమంత్రి' పీఠాన్ని అధిష్టించి నవచరిత్రని సృష్టించారు. ఆ రకంగా దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి కుమారి మాయావతిని ముఖ్యమంత్రిగా తీర్చిదిద్దిన ఘనత కాన్షీరామ్‌కి దక్కింది.

బహుజన సమాజ్ పార్టీ 1996 నాటికి 'జాతీయ పార్టీ'గా గుర్తింపు పొందడం వెనకాల కాన్షీరామ్ నిర్విరామ కృషి ఉంది. 2003లో పక్షవాతానికి గురైన కాన్షీరామ్ క్రమంగా ప్రజా జీవితం నుండి తప్పుకుని బి.ఎస్.పి బాధ్యతలను కుమారి మాయావతికి అప్పగించారు. 2007 నాటి అసెంబ్లీ ఎన్నికలలో మాత్రమే పూర్తిస్థాయి మెజారిటీని సాధించిన బి.ఎస్.పి ఆ తర్వాతి కాలంలో వెనకబడిపోయింది.

నేడు కాన్షీరామ్ కృషి వలన కులగణన, రిజర్వేషన్ల పెంపు తదితర సామాజిక న్యాయం వంటి డిమాండ్స్ ప్రబలంగా ముందుకు వస్తున్నాయి. 'విప్లవం అంటే కేవలం సంక్షేమ పథకాల కోసం ఉద్యమాలు చేయడం కాదు. బహుజనుల రాజ్యాధికారం సిద్ధించి అగ్ర కులాల వారు మాకు న్యాయం కావాలి అని రోడ్ల మీదకు రావడమే నిజమైన విప్లవం' అని కాన్షీరామ్ సరికొత్తగా నిర్వచించారు.

అంతిమంగా అట్టడుగు వర్గాల విముక్తికి ఉద్యమాలు సాగించిన మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, నారాయణ గురు, పెరియార్ రామస్వామి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ల సరసన కాన్షీరామ్ నిలిచారు. అంబేద్కరిజాన్ని ఆయుధంగా మలచుకుని బహుజన రాజ్యాధికార సాధన కోసం అవిశ్రాంతంగా ఉద్యమించిన కాన్షీరామ్ 2006 అక్టోబర్ 9న మరణించారు. ఆయన మరణించిననూ బహుజన బతుకుల్లో వెలుగులు ప్రకాశింపజేస్తూనే ఉన్నారు.

**(అక్టోబర్ 9 కాన్షీరామ్ 20వ వర్ధంతి)**



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్

# కాన్షీరాం బహుజనోద్యమానికి పునర్జీవం

భారత ఉపఖండంలో బహుజన రాజ్యాధికార స్వప్నానికి బాటలు వేసిన యోధుడు మాన్యవర్ కాన్షీరాం. "ఓట్లు మావి--సీట్లు మీవా ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు" అంటూ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. "ఎవరెంతో వారికంతా వాటా" అనే నినాదంతో జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేసిన మొట్టమొదటి బహుజన నాయకుడు. భారత రాజ్యాంగం అమలైన తర్వాత, 1975 ఎమర్జెన్సీ తరువాత కూడా అటు దేశంలో, ఇటు రాష్ట్రాల్లోనూ అగ్రవర్ణ రైటిస్ట్, లెఫ్టిస్ట్, లిబరల్ పార్టీలే అధికారంలో ఉండేవి. ఆ పార్టీలలో ఒకరేమో రాజ్యాంగం బూటకమని, మరొకరేమో రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రపన్నారు. ఆ పార్టీలకు అభిముఖంగా కాన్షీరాం కాన్స్టిట్యూషనలిజంతో బహుజనులను ఏకంచేసి రాజ్యాధికారం వైపు నడిపించారు. అందుకే మన దేశ రాజకీయ చరిత్రను కాన్షీరాంకు ముందు, ఆ తరువాత అని చదువుకోవాలి.

**దేశ రాజకీయల్లో బహుజనుల మార్క్.**

అంబేద్కర్ వారసుడుగా కాన్షీరామ్ మార్చ్ 15,1934న పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా, ఖవాస్ గ్రామంలో చమార్(మాదిగ) కులంలో జన్మించాడు. అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన పుస్తకాన్ని చదివి ప్రేరణ పొంది, తన జీవితాన్నే బహుజన విముక్తి కోసం అంకితం చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగస్తులతో బామ్‌సెఫ్, డీఎస్-4 సంస్థలను నెలకొల్పి సామాజిక సాంస్కృతిక రాజకీయ ఉద్యమాన్ని నిర్మించాడు. 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీని స్థాపించి జాతీయ రాజకీయాల్లో గొప్ప ప్రభావాన్ని చూపాడు. ఈ క్రమంలో కాన్షీరాం1994 నుంచి 2003 వరకు ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పర్యటించారు. ఇక్కడ మాదిగ-మాలలు, బీసీలను నాయకులను చేద్దామనుకున్నారు. అయితే ఆయన రాజకీయ వ్యూహం, పని విధానం అర్థం చేసుకోలేకపోయారు, అందులో భాగం కాలేకపోయారు. తీవ్ర కోపం, నిరాశకు గురై బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. అనంతరం 2006 అక్టోబర్ 9న కన్నుమూశారు. రెండు దశాబ్దాల క్రితం తెలుగు నేలపై ఆగిపోయిన కాన్షీరామ్ రాజ్యాధికార మిషన్ ఇప్పుడు "ఎవరి కులమెంతో వారికి అంత వాటా" అనే నినాదంతో డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో ధర్మ సమాజ్ పార్టీ, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ స్వశక్తితో, స్వధర్మంతో పునఃప్రారంభమైనది. ఆ దిశగా బీసీ సమాజం నుంచి రిటైర్డ్ ఐఏఎస్ టి. చిరంజీవులు, రిటైర్డ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య రాజకీయ చైతన్యాన్ని రగిలిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆజాద్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) బహుజనుల హక్కులు, అధికారం కోసం ముందుకు వెళ్తుంది. ఇటీవల భారత రాజ్యాంగమే ఐడియాలజీగా అభిజిత్ దీప్కే నాయకత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ జేన్ జీ విప్లవం బయలుదేరింది. బహుజన నాయకత్వంలో నడుస్తున్న ఈ "ఆధునిక వేదికలు" అగ్రవర్ణ పార్టీలకు అభిముఖంగా కాన్షీరాం రాజ్యాధికార 'కల'ను కాన్స్టిట్యూషనలిజంతో పునర్జీవింపచేస్తున్నాయి.

**కులమే రాజకీయ అస్త్రంగా...**

"రాజ్యాధికారమే మాస్టర్ కీ" అని బోధించిన అంబేద్కర్ ఆలోచనతో దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన శక్తి కాన్షీరాం. ఒక ఓటు-ఒక నోటు నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. "85 శాతం జనాభా నీతో ఉన్నప్పుడు, 15 శాతం మీద ఎందుకు ఆధారపడాలి?" అని కాన్షీరాం ప్రశ్నిస్తూ, బహుజనుల సంఖ్యాబలాన్ని సామాజిక-రాజకీయ శక్తిగా మలిచాడు. పార్లమెంటు, అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్వాభిమానన్నీ నేర్పిన యోధుడు. కాన్షీరాం ఓబీసీ హక్కుల కోసం బలంగా ఉద్యమించారు. 1984 ఆగస్టులో "మండల కమిషన్ నివేదిక అమలు చేయండి లేదా కుర్చీ ఖాళీ చేయండి" అనే నినాదంతో ఢిల్లీలోని బోట్స్ క్లబ్ వద్ద జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల భారతంలో కులాన్నీ రాజకీయ అస్త్రంగా వాడి కులాన్ని కూల్చే ప్రయత్నం చేసిన రాజనీతిజ్ఞుడు. మినీ ఇండియా లాంటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒక దళిత మహిళ మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాడు. ఇది భారత రాజకీయాల్లో అరుదైన ఘట్టం. ఆమె హయాంలో 7 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టింది. దళిత అధికారులకు రాష్ట్ర సచివాలయం, జిల్లాల్లో ఉన్నత హోదాల్లో అవకాశం కల్పించారు. వేల కోట్ల రూపాయలతో ఎస్సీ ఎస్టీ బీసీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. అట్టడుగు వర్గాల చేతిలో అధికారం ఉండడమే ఇలాంటి మార్పులకు కారణమైనది. కాన్షీరామ్ బహుజనోద్యమం పంజాబ్, రాజస్తాన్, కర్ణాటక, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రభావం చూపింది. కాన్షీరాం రాజకీయ చైతన్యం ఓబీసీ కులాల్లో రాజకీయ కాంక్షను రగిలించింది. యూపీలో ములాయం సింగ్ యాదవ్, బీహార్ లో లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి నాయకులు సొంత రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకోగలిగారు. దక్షిణాన తమిళనాట ఆత్మగౌరవ రాజకీయాలు ఇందుకు నిదర్శనమే.

**కాన్షీరాం బహుజనోద్యమమే విముక్తికి మార్గం.**

80 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి, సంపద, అధికారంలో సముచిత వాటా దక్కలేదు. దీనికి ప్రదానం కారణం మన విముక్తినీ, చైతన్యాన్ని దారి మళ్లించే అగ్రకుల పార్టీలు, ఉద్యమాల్లో మన శక్తిని వినియోగించడమే. కాన్షీరాం భాషలో చెప్పాలంటే.. చెంచా రాజకీయాలు, ఓటును తాకట్టు పెట్టే కుల దళారీ వ్యవస్థ కారణం. ఇకనైనా ఆ రాజకీయాలకు చరమగీతం పాడి, స్వశక్తి-స్వధర్మంతో కాన్షీరాం బాటలో నడుద్దాం. గతేడాది తెలంగాణలో బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ రగిలించిన చైతన్యంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనులు 86.4 శాతం గెలుపొందారు. నీట్ పేపర్ లీకేజీపై సిజేపీ విద్యార్థుల పోరాటం కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఇప్పుడు బుద్ధుడు, అశోకుడు, సంతు రవిదాస్, పూలే, సాహు మహారాజ్, అంబేద్కర్, కాన్షీరాం సాంస్కృతిక రాజకీయ ఉద్యమ రథాన్ని మరోసారి ప్రతిధ్వనించాలి. ఈ ఉద్యమాలను రాజ్యాంగం ద్వారా లాభపడ్డ బుద్ధిజీవులు మద్దతు పలకాల్సిన చారిత్రక అవసరం ఉంది. కాన్షీరాం మిషన్‌కు ముగింపు లేదు. బీసీ-ఎస్సీ-ఎస్టీలు స్వశక్తి, స్వధర్మంతో ఏకమై ఓటు అనే ఆయుధంతో రాజ్యాధికారం సాధించడమే కాన్షీరాంకు నిజమైన నివాళి.



సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
7989579428

## నార్సింగిలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష



**రాజేంద్రనగర్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్‌లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ నార్సింగి సర్కిల్-45 కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణతో కలిసి నిర్వహించిన సమావేశంలో పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా విజయ సూపర్ మార్కెట్ నుంచి జనచైతన్యకు లింక్ రోడ్డు, ట్రైల్స్ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి దర్గా హైటెన్షన్ లైన్ వరకు లింక్ రోడ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ సమావేశంలో డిసీ లక్ష్మారెడ్డి,ఎఏంసీలు, ఎఈ, డీఈ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### బుల్కాపూర్ నాలా పనులను పరిశీలన

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.100 కోట్లతో చేపడుతున్న ఎస్ఎన్డిపి బుల్కాపూర్ నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, డీసీ లక్ష్మారెడ్డి లతో కలిసి పరిశీలించారు.పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు బి శ్రీరాములు, కె. రామకృష్ణారెడ్డి,ఆర్. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### కోకాపేటలో వ్యర్థాల వేర్పాటు పై అవగాహన

సర్కిల్-45 పరిధిలోని కోకాపేట్ వార్డు నం.125లో వ్యాపారస్తులకు తడి, పొడి, హానికర చెత్త వేర్పాటుపై సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం అవగాహన కల్పించారు. "నో బిన్--నో ట్రేడ్"లో భాగంగా ప్రతి వ్యాపార సంస్థలో తడి, పొడి చెత్తకు ప్రత్యేక బిన్నులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు మున్సిపల్ సిబ్బందికి సహకరించి, చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసి అందించాలని కోరారు.

## సర్కారు భూమిలో 'దివ్యశక్తి' కంపెనీ విష కాలుష్యం..!

- మట్టి మాఫియాతో చేతులు కలిపిన పేపర్ మిల్లు యాజమాన్యం
- మట్టిని అమ్మేస్తున్నారు, గుంతలో వ్యర్థాలను పోస్తున్నారు
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పక్కనే పర్యావరణ విధ్వంసం
- రంగంలోకి దిగిన సర్పంచ్ చౌడపురం ప్రభాకర్
- తహసీల్దార్‌కు మట్టిమాఫియా, దివ్యశక్తి కంపెనీపై ఫిర్యాదు
- అక్రమార్కులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్ మీర్ ఆజం అలీ

**కొందుర్గు, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, పారిశ్రామిక దిగ్గజాలు చేతులు కలిపి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ, పర్యావరణాన్ని నిలువునా పాతర వేస్తున్నారు. చట్టాలంటే భయం, అధికారులంటే లెక్కలేని రీతిలో కొందుర్గు మండల కేంద్రంలో ఒక భారీ భూ-పర్యావరణ కుంభకోణం వెలుగుచూసింది. ఇక్కడి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సమీపంలో సర్వే నంబర్ 109 లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని కొందరు కేటుగాళ్లు తమ సొంత ఆస్తిలా భావించి దోచేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తవ్వి బహిరంగంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఈ దందాపై పెద్ద ఎత్తున వార్తలు వైరల్ కావడంతో స్థానిక అధికార యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. సాధారణంగా ఏ కంపెనీ అయినా తమ వ్యర్థాలను నిబంధనల ప్రకారం సొంత ప్రాపర్టీలో లేదా నిర్దేశిత ల్యాండ్‌ఫిల్స్‌లోనే శాస్త్రీయంగా నిర్వీర్యం చేయాలి. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది. ఇక్కడ మట్టి వ్యాపారులు తవ్విన భారీ గుంతలను ఆసరాగా చేసుకొని, కొందుర్గులో కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన దివ్యశక్తి పేపర్ కంపెనీ తమ కంపెనీ నుంచి వెలువడే



ప్రమాదకరమైన, రసాయన కాలుష్య వ్యర్థాలను అర్ధరాత్రి వేళల్లో ఈ ప్రభుత్వ భూమిలోని గుంతల్లో కుమ్మరిస్తోంది. మట్టి మాఫియా తవ్విన గుంతలను పూడ్చడానికి, దివ్యశక్తి పేపర్ మిల్లు యాజమాన్యంతో సదరు అక్రమార్కులు రహస్య ఒప్పందాలు కుదుర్చుకుని ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది.

ఈ పర్యావరణ ఉల్లంఘనలపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు తక్షణమే స్పందించిన కొందుర్గు స్థానిక తహసీల్దార్ మీర్ ఆజం అలీ, కొందుర్గు తూర్పు గ్రామ పరిపాలనా అధికారి (జి పి ఓ) హరీష్ మరియు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ వ్యర్థాలు కుమ్మరిస్తున్న ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు పరిశ్రమల విష వ్యర్థాలను పారబోయడం క్షమించరాని నేరమని తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమాలకు పాల్పడుతున్న మాఫియాపై, నిబంధనలు ఉల్లంఘించిన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఈ భూ-పర్యావరణ కుంభకోణంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందుర్గులో అత్యవసర మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్" సమీపంలో కొందరు స్వార్థపరులు మట్టి వ్యాపారం చేస్తూ, కంపెనీ వ్యర్థాలను అక్రమంగా పోయిస్తూ ప్రభుత్వం మరియు పార్టీ ప్రతిష్టను అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు.

### చట్టప్రకారం నేరం



ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అనుమతులు లేకుండా సహజ వనరులను తరలించడం చట్టప్రకారం తీవ్రమైన నేరం. అంతేకాకుండా, వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' పరిసరాల్లో ఇలాంటి విష వ్యర్థాలను కుమ్మరించి, పర్యావరణాన్ని నాశనం చేయడం ప్రజా ఆరోగ్యాన్ని, ప్రభుత్వ ఆస్తులను దెబ్బతీస్తున్న మట్టి మాఫియాపై, నిబంధనలను ఉల్లంఘించిన 'దివ్యశక్తి పేపర్ మిల్లు' యాజమాన్యంపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా అధికారిక ఫిర్యాదు దాఖలు చేశాము.

**మీర్ అజాం అలీ, కొందుర్గు తహశీల్దార్**

### పర్యావరణానికి ముప్పు



మట్టి మాఫియా అక్రమంగా వందలాది టిప్పర్ల మట్టిని తవ్వి అమ్మేసింది, ఆ గుంతలను పూడ్చడానికి పేపర్ మిల్లు యాజమాన్యంతో చేతులు కలిపి రాత్రి వేళల్లో కెమికల్ వ్యర్థాలను పోస్తున్నారు. వర్షాలు పడితే ఈ ప్రమాదకర రసాయనాలు భూమిలోకి ఇంకిపోయి, భూగర్భ జలాల్లోకి మరియు పక్కనే ఉన్న రైతుల పంట పొలాల్లోకి చేరి తీవ్ర పర్యావరణ విధ్వంసానికి దారితీస్తుంది.

**చౌడపురం ప్రభాకర్, కొందుర్గు గ్రామ సర్పంచ్**

## జెండా ఏదైనా ఎజెండా మాత్రం ప్రజల సంక్షేమమే కావాలి

- ఎంపీ ఈటెల

**శామీర్‌పేట్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు . ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజ లకు మెరుగైన పౌర సేవలు అందించడంపై సభ్యు లతో చర్చించారు.ఈ సమావేశంలో రాబోయే బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అవసర మైన ఏర్పాట్లు, మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు మరియు పాత ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, మౌలిక సదు పాయాల అభివృద్ధి, వీధి దీపాలు, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడు తూ.. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజాప్రతి నిధులందరూ పార్టీలకు అతీతంగా ఐక్యంగా పనిచేయ్యాలని సూచించారు.




మున్సిపాలిటీలోని ప్రతి వార్డు, ప్రతి ఇల్లు, ప్రతి పౌరుడు ముఖ్యమని, ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థ వంతమైన పౌర సేవలు అందించడమే ప్రజాప్రతి నిధుల ప్రధాన బాధ్యత అని అన్నారు. జెండా ఏదైనా ఎజెండా మాత్రం ప్రజల సంక్షేమమే కావాలి అనే భావనతో ప్రతి ఒక్కరూ ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసర మైన మౌలిక సదుపాయాలు, త్రాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఐక్యంగా పని చేయడం ద్వారా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని, గతంలో తెలంగాణ ఉద్యమ కాలంలో తనకు ఎదురైన అనుభవాలను కూడా సభ్యులతో పంచుకున్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైనప్పుడు తనను సంప్ర దించవచ్చని ఎంపీ ఈటల రాజేందర్ సభ్యులకు భరోసా ఇచ్చారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమన్వయంతో పనిచేసి అలియాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ మాలతి, కౌన్సిలర్లు యూసుఫ్, కుమార్, దీపా, యమున,తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



**చేవెళ్ల, అక్టోబరు 08 (జనంసాక్షి) :** రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ గౌతమ్, రాజశేఖర్ సూచించారు. గురువారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని మొజెర్ల ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలతో కలిసి చేవెళ్ల మండలంలోని కందవాడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న పూలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగు పద్ధతులపై రైతులకు పలు సూచనలు, అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు వ్యవసాయంపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని తెలిపారు. ఉద్యాన విద్యార్థులకు ఫీల్డ్ విజిట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అనురాధ సాయి రెడ్డి, ఉపాధ్యాయులు, రైతులు, ఉద్యాన కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యూఏఈలో మహిళా అసిస్టెంట్ నర్సులకు ఉద్యోగావకాశాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో మహిళా అసిస్టెంట్ నర్సుల నియామకానికి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి శాఖ అధికారి ఎం.రాధిక తెలిపారు. హోమ్‌కేర్, ఆసుపత్రులు, క్లినిక్‌లలో రోగులకు సంరక్షణ సేవలు అందించేందుకు మహిళా అసిస్టెంట్ నర్సులను యూఏఈలో నియమించనున్నట్లు జిల్లా ఉపాధి శాఖ అధికారి ఎం.రాధిక గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నర్సింగ్ రంగంలో అర్హతలు, అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక విద్యార్హతలు, సంబంధిత పని అనుభవం, క్లినికల్ నైపుణ్యాలు, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ సామర్థ్యం, యూఏఈ లైసెన్సింగ్ లేదా డేటాఫ్లో అర్హతల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం ఏడాది అనుభవం ఉన్న



అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఆసుపత్రి, క్లినిక్ లేదా హోమ్‌కేర్ కేంద్రాల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఉద్యోగ ఒప్పందం రెండేళ్లపాటు (24 నెలలు) అమల్లో ఉంటుంది. ఎంపికైన వారికి రవాణా సౌకర్యం, ప్రాథమిక వైద్యబీమా తదితర ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా (సీవీ)ను tomcomglobal@gmail.comకు పంపాలని, మరిన్ని వివరాలకు 08035524946 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగాల కోసం పారదర్శకంగా నియామకాలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నిమ్స్‌లో వృద్ధుల ఆరోగ్య సంరక్షణపై వర్క్‌షాప్

- పాల్గొన్న 250 మంది నర్సింగ్, అనుబంధ ఆరోగ్య విభాగాల విద్యార్థులు

ఖైరతాబాద్, అక్టోబర్ 8 (జనం సాక్షి) : నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో సటోరు ఫౌండేషన్, నిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులకు వృద్ధుల ఆరోగ్య సంరక్షణపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమర్జెన్సీ భవనంలోని ట్రామా ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు నర్సింగ్ కళాశాలలకు చెందిన సుమారు 250 మంది నర్సింగ్, అనుబంధ ఆరోగ్య విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను నిమ్స్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారికి ప్రత్యేక వైద్య సంరక్షణ అవసరం కూడా పెరుగుతోందన్నారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో నర్సులు కీలక పాత్ర పోషిస్తారని, వైద్య నైపుణ్యాలతో పాటు మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రంగారావు వృద్ధుల్లో సాధారణంగా కనిపించే ఎముకలు, కీళ్ల సమస్యలు, పడిపోవడం, ఎముకల విరుగుడు, ఆస్టియోపోరోసిస్, కదలికలు తగ్గడం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ దర్శిత వృద్ధాప్యంలో సంభవించే శారీరక మార్పులు, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ, రోగి-కేంద్రిత సమగ్ర సంరక్షణపై వివరించారు. డాక్టర్ సూర్య ప్రభ స్ట్రోక్, డిమెన్షియా, ఇతర నాడీ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం గురించి వివరించారు. డాక్టర్ నజ్మస్



సాఖిబ్ వృద్ధుల్లో కనిపించే డిప్రెషన్, ఆందోళన, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వృద్ధుల సంరక్షణలో మానసిక, సామాజిక సహకారం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమానికి సటోరు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కనగాల సాయి చరణ్ అధ్యక్షత వహించారు. వృద్ధుల గౌరవం, ఆరోగ్యం, సంక్షేమం కోసం నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ అందించడం తమ ఫౌండేషన్ లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. భవిష్యత్తులోనూ వైద్య సంస్థలతో కలిసి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. వర్క్‌షాప్ సమాచారాత్మకంగా, ఆచరణాత్మకంగా సాగిందని విద్యార్థులు తెలిపారు. వృద్ధుల ఆరోగ్య అవసరాలపై సమగ్ర అవగాహన కల్పించిన నిమ్స్, వైద్య నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి చేరేలా కార్యకర్తలు పని చేయాలి

- కాగ్నా నుండి యాలాల్‌కు మంచినీరు అందిస్తా
- నూతన ఉత్సాహంతో పార్టీని మరింత బలోపేతం చేద్దాం
- ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి చేరేలా కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణం ఎస్ విఆర్ గార్డెన్స్‌లో గురువారం యాలాల్ మండల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి. నూతనంగా నియమించిన అన్ని గ్రామాల అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశానికి వచ్చిన నాయకులకు, కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు.ఒక పార్టీకి నాయకులు ఎంత ముఖ్యమో, ఆ పార్టీకి కార్యకర్తలు అంతకంటే ముఖ్యమైన బలం.నాయకులు పార్టీకి దిశానిర్దేశం చేస్తారు. కానీ ఆ దిశను ప్రజల్లోకి తీసుకెళ్లేది కార్యకర్తలే.కార్యకర్తలు పదవితో సంబంధం లేకుండా ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోండి, పదవిలో ఉన్న వారికంటే ప్రజల్లో మీకు ఎక్కువ ఆదరణ ఉంటుంది.ప్రతి కార్యకర్త పని, కష్టం, బాధ నాకు బాగా తెలుసు. అందుకే మీ అందరినీ కలవాలని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం.పార్టీ




కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి అండగా ఉంటా. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి చేరేలా కార్యకర్తలు పని చేయాలి.గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలి. రాబోయే రోజుల్లో మనం గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలి.ప్రతీ బూత్ లో మన కార్యకర్తలు చురుకుగా సమన్వయంతో పనిచేయాలి.గత పాలకులు ఎక్కువ అబద్దాలు చెప్పారు. మనం వాళ్ళలాగా చెప్పలేదు, పనులు చేసి చూయిస్తున్నాం.మన ప్రభుత్వం వచ్చాక రేషన్ కార్డులు, పెన్షన్ లు, ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చాం. అందరికి రైతు ఋణమాఫీ చేశాం. ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు, రూ.500 లకే సిలిండర్ అందిస్తున్నాం.ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం, పాఠశాలను బాగు చేసుకున్నాం. నియోజకవర్గంలో అన్ని రోడ్లు బాగు చేస్తున్నాం, యాలాల్ మండలంలో అన్ని రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఒక సంవత్సరంలోపు పూర్తవుతాయి.యాలాల్ మండలంలో దాదాపు 500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం.జుంటుపల్లి ప్రాజెక్ట్ పనుల కోసం దాదాపు 5కోట్లు మంజూరు చేయించాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం. దౌలపూర్ లో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మిస్తున్నాం.లక్ష్మీనారాయణ పూర్ - దేవనూర్ వరకు, లక్ష్మీనారాయణ పూర్ - మైల్వార్ వరకు రోడ్లు, కోకట్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం.మంచి రోడ్లు నిర్మించుకుందాం. మన భూములకు మంచి రెట్లు పెరుగుతాయి. ప్రతీ గ్రామంలో ఎస్.హెచ్ జీ, స్కూల్ కాంపౌండ్ వాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు చేశాం. పనులు జరుగుతున్నాయి.ప్రతీ కార్యకర్త పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.తాండూరులో ఎటిసి సెంటర్, బషీరాబాద్ లో జూనియర్ కళాశాల మంజూరు చేశాం.తాండూరులో యువత కోసం ఉచిత కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశాం కాగ్నా నుండి యాలాల్ కు మంచినీరు అందిస్తా.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈ నెల 11న హైదరాబాద్‌లో జపాన్ ఫెస్టివల్-2026



**ఖైరతాబాద్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** నారా జపాన్ హబ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ సహకారంతో అక్టోబర్ 11న హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో జపాన్ ఫెస్టివల్ - 2026 నిర్వహించనున్నట్లు నా రా జపాన్ హబ్ వ్యవస్థా పకుడు బి.రామ భద్ర గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశం ఉచితం అని, మియోషి సిటీ పప్పెట్ షో, ఇకెబానా, ఇండియా - జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్ అవార్డులు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని తెలిపారు. కో-ఫౌండర్ బి.నాగనాథ్, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హిరోషి ఫురుటా, చైర్మన్ సోయిచిరో ససాకి, లాంగ్వేజ్ అండ్ కల్చర్ డైరెక్టర్ టగుచి హిడెట్సుగు లతోకలసి ఆయన మాట్లాడుతూ యువత కోసం జపాన్ విద్య, ఉద్యోగాలు, జపనీస్ భాష, నైపుణ్యాలు, కెరీర్ అవకాశాలపై సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. బోన్సాయ్, సుమి - ఏ, అనిమే, రోబోటిక్స్, మార్షల్ ఆర్ట్స్, టీ సెరిమనీ, కాస్ తదితర కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయని తెలిపారు.

# కరస్‌గుత్తి 30 పడకల ఆసుపత్రిలో విధులపై ఆరోపణలు

- డిప్యూటేషన్ పేరుతో సిబ్బంది గైర్హాజరు..?
- పేషెంట్ కేర్ టేకర్లతో వైద్య పనులపై ఆరోపణలు
- ల్యాబ్ మెటీరియల్, భోజనాలపై స్థానికుల ఆవేదన



**నాగల్గిద్ద, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** నాగలిగిద్ద మండలంలోని కరస్‌గుత్తి 30 పడకల సామాజిక ఆసుపత్రిలో వైద్య సేవలపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు కలిపి మొత్తం 14 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పలువురు సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డిప్యూటేషన్ పేరుతో కొందరు సిబ్బంది ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు.

### సూపరింటెండెంట్ విధులపై ఆరోపణలు

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జోవేల్ విధులు నిర్వహిస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. సూపరింటెండెంట్ వారానికి రెండు, మూడు సార్లు మాత్రమే విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో ఉండి వైద్య సేవలను పర్యవేక్షించాలని వారు కోరుతున్నారు.

### పేషెంట్ కేర్ టేకర్లతో వైద్య పనులా..?

ఆసుపత్రిలో పేషెంట్ కేర్ టేకర్లతో ఇంజక్షన్ సిరంజీలు నింపిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వైద్యపరమైన శిక్షణ లేని వారితో ఇలాంటి పనులు చేయించడం రోగులకు ప్రమాదకరమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ టాబ్లెట్ ఇవ్వాలి, ఏ ఇంజక్షన్ వేయాలి అనే విషయాల్లో కూడా పేషెంట్ కేర్ టేకర్లే వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నర్సులు నామమాత్రంగా ఉండి, రోగుల సంరక్షణలోని పలు బాధ్యతలను కేర్ టేకర్లకే అప్పగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతి టాబ్లెట్, ప్రతి ఇంజక్షన్ వైద్యులు లేదా శిక్షణ పొందిన నర్సుల పర్యవేక్షణలోనే ఇవ్వాలని కోరుతున్నారు. శిక్షణ లేని సిబ్బందితో మందుల విషయంలో పొరపాట్లు జరిగితే రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ల్యాబ్ సేవలపై అసంతృప్తి

ఆసుపత్రిలో బ్లడ్ చెకప్‌లకు సంబంధించిన ల్యాబ్ మెటీరియల్ సక్రమంగా అందడం లేదని రోగులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అవసరమైన పరీక్షలు చేయించుకోవడానికి రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక రక్త పరీక్షలకు అవసరమైన సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ల్యాబ్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రభుత్వ ఆదేశాలు అమలవుతున్నాయా..?

30 పడకల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కొందరు సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యూటేషన్‌లో ఉన్న సిబ్బంది కూడా అవసరమైన సమయంలో కరస్‌గుత్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రిలో బయోమెట్రిక్ హాజరును, విధుల రోస్టర్‌ను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

### టెండర్ భోజనాలపై ఆరోపణలు

ఆసుపత్రిలో రోగులకు అందించాల్సిన భోజనాల విషయంలోనూ పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్ భోజనాల పేరుతో వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అన్నం, గుడ్డు వంటి భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులకు అందాల్సిన భోజనం ఎక్కడికి వెళుతుందనే విషయంపై అధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు. భోజనాల సరఫరాకు సంబంధించిన టెండర్లు, బిల్లులు, రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

కరస్‌గుత్తి 30 పడకల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. సిబ్బంది హాజరు, డిప్యూటేషన్లు, ల్యాబ్ మెటీరియల్ సరఫరా, రోగులకు భోజనాల పంపిణీపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పేషెంట్ కేర్ టేకర్లతో వైద్యపరమైన పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరపాలని కోరుతున్నారు. రోగులకు అందాల్సిన మందులు, ఇంజక్షన్లు నిబంధనల ప్రకారం శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలోనే అందించాలని సూచిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆసుపత్రిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రోగుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశం కావడంతో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కరస్‌గుత్తి ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణలకు అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

## చెట్ల ఆకులు తినిపించిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్‌కు తల్లిదండ్రుల ఫిర్యాదు



**కొల్చారం, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన గిరిజన విద్యార్థిని దీపకు పాఠశాలలో చెట్ల ఆకులు తినిపించారని ఆరోపిస్తూ ఆమె తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీప నర్సాపూర్ పట్టణ పరిధిలోని నారాయణపూర్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. విద్యార్థిని తెలిపిన వివరాల ప్రకారం.. తరగతి గదిని శుభ్రం చేస్తుండగా స్టూల్ మరో విద్యార్థినికి తగిలింది. దీనిని కారణంగా చూపిన క్లాస్ టీచర్ శ్రీలత, పనిష్మెంట్ పేరుతో తనను బయటకు తీసుకెళ్లి చెట్ల ఆకులు తినిపించారని ఆరోపించింది. అనంతరం వాంతులు కావడంతో పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపింది. తల్లిదండ్రులు విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించిన అనంతరం తిరిగి పాఠశాలకు తీసుకెళ్లారు. ఘటనపై టీచర్‌ను ప్రశ్నించగా తమతో అనుచితంగా మాట్లాడారని, "ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. టీచర్‌పై భయంతో తమ కుమార్తె పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదని తండ్రి సంతోష్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, విద్యార్థినికి న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** గురుకుల విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి పట్టణంలోని షెడ్యూల్డ్ తెగల గురుకుల ఆశ్రమ పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు, హాజరు శాతం, గతేడాది ఉత్తీర్ణత వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో ఎన్ఐటీ, ఐఐటీలకు అర్హత సాధించిన వారి వివరాలను పరిశీలించారు. ఆయా విద్యార్థులతో ప్రస్తుత విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించి, వచ్చే ఏడాది ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో ఎక్కువ మంది సీట్లు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు బోర్డుపై లెక్కలు వేయించి పరిష్కరించాల్సిందిగా సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం, ఇతర వసతులపై సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. వంట సామగ్రి స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 46 గ్రాముల గంజాయి స్వాధీనం..

- ఒకరు అరెస్ట్



**కొల్చారం, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 46 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని అరెస్ట్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. బుధవారం అప్పాజీపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, నంబర్ ప్లేట్ లేని బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్న ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు కొల్చారం గ్రామానికి చెందిన తెనుగు సాయికుమార్ (19), కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. బైక్ ట్యాంక్ కవర్‌ను తనిఖీ చేయగా 46 గ్రాముల ఎండు గంజాయితో పాటు సెల్‌ఫోన్ లభించిందన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2,300 ఉంటుందని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఈ నెల 6న నారాయణఖేడ్‌కు చెందిన నవీన్ అనే వ్యక్తి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని రూ.1,000కు కొనుగోలు చేసి, విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి, సెల్‌ఫోన్, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం స్వాధీనం ప్రక్రియను నిర్వహించి, తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## మధుమేహ రోగులకు కంటి పరీక్షలు విస్తృతం చేయాలి

- కాటరాక్ట్ గుర్తించిన వారికి ఉచిత శస్త్రచికిత్సకు చర్యలు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**నాగల్గిద్ద, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** మధుమేహంతో బాధపడుతున్న వారికి రెటినోపతి పరీక్షలు నిర్వహించి కంటి సమస్యలను ముందుగానే గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. కాటరాక్ట్ సమస్య ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు, ఉచిత శస్త్రచికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో గుర్తించిన మధుమేహ రోగులకు ఆధునిక పరికరాల సహాయంతో నిర్వహిస్తున్న ముందస్తు కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. మధుమేహం కారణంగా కంటి చూపుపై ప్రభావం పడకుండా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి తగిన వైద్యం అందించాలని సూచించారు. కంటి సమస్యలు గుర్తించిన వారికి ఉచిత శస్త్రచికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన సందర్భాల్లో హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రులకు రిఫర్ చేసి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

### క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

జిల్లాను క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో వచ్చే రోగులకు తప్పనిసరిగా కఫ పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించాలని అన్నారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ నెలలో నిర్వహించిన రక్త పరీక్షల సంఖ్య, రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరీక్షలు, చికిత్స విధానంపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్ నాయక్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో పంచాయతీ వర్కర్ మృతి



**ఉప్పునుంతల, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** విద్యుత్ షాక్‌కు గురై పంచాయతీ వర్కర్ మృతి చెందిన ఘటన ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్టూరు గ్రామానికి చెందిన పంచాయతీ వర్కర్ ఎడ్ల నిరంజన్ (40) విద్యుత్ బుడ్డిని దిమ్మెపై అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన నిరంజన్‌ను కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు.

## సమాజంలో సామరస్యంతోనే ప్రపంచ శాంతి సాధ్యం




**సంగారెడ్డి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల శారీరక విద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పట్లొళ్ళఅశ్విని రెడ్డికి తెలంగాణ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ శాంతి పురస్కారం కళాశాల ప్రొఫెసర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ముందుగా తమలో శాంతిని పెంపొందించుకోవాలని అన్నారు. శాంతి బయట నుంచి రాదని, మన అంతరంగంలోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భారతీయ యోగ సంప్రదాయంలో పతంజలి మహర్షి ప్రతిపాదించిన యమ, నియమాలు వ్యక్తిగత జీవితంలో శాంతి, క్రమశిక్షణ, సామరస్యాన్ని పెంపొందించేందుకు మార్గదర్శకాలని తెలిపారు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం వంటి యమాలు ఇతరులతో సౌహార్దపూర్వక సంబంధాలను పెంపొందిస్తాయని వివరించారు. శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం వంటి నియమాలు వ్యక్తి అంతరంగ శుద్ధికి దోహదపడతాయని చెప్పారు. ఒక వ్యక్తిలోని శాంతి కుటుంబంలో శాంతికి, కుటుంబంలోని శాంతి సమాజంలో సామరస్యానికి, సమాజంలోని సామరస్యం ప్రపంచ శాంతికి దారితీస్తుందని అశ్విని రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



**పెద్దశంకరంపేట, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** గురువారం శంకరంపేట్ మండలంలో రైతులకు ఎల్ ని నో ప్రభావితం మరియు యాసంగి పంటలపై అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు యాసంగికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. దీనిలో భాగంగా రైతులు వరి పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన జొన్నలు మొక్కజొన్న కుసుమలు ఇతర మిల్లెట్లపై దృష్టి సారించాలని వివరించారు. ఎల్ ని నో ప్రభావము వలన వాన కాలంలో వర్షాలు తగ్గుముఖం పట్టినందున బోరులలో తగునీరు పంటలకు అందకపోవచ్చునని అదేవిధంగా విద్యుత్తు సరఫరా కూడా అంతరాయం ఉండవచ్చునని దీని ద్వారా పంటలపై ప్రభావితం చూపబడుతుందని అందువల్ల వరికి బదులు వేరే ఇతర ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై దృష్టి సాధించాలని రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. రైతులు ప్రత్యామ్నాయ పంటలు ఏఏ పంటలు వేదలుచుకున్నారో వాటికి విత్తనాలు కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఏ ఈ ఓ లు వినీత్ అఖిల్ రైతులు పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్యంగా పోరాడితేనే హక్కుల సాధన

**ఏఐపికెయంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. కృష్ణ**



**ఉట్కూర్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ఉట్కూర్ మండలంలోని అమీన్‌పూర్‌లో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా జెండా ఆవిష్కరణ, ర్యాలీ, సభ నిర్వహించారు. గ్రామ కూడలిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కోటి చెన్నప్ప ఎగురవేశారు. అనంతరం హనుమాన్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ చేపట్టారు. గ్రామ అధ్యక్షుడు ఆశప్ప అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు ఎం. కృష్ణ మాట్లాడుతూ దేశంలో 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అందక బతుకులు దుర్భరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారుల రుణాలను మాఫీ చేస్తున్నాయే తప్ప, కార్మికులకు జీవన భద్రత కల్పించడం లేదన్నారు. కరువు మండలాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రామాంజనేయులు, నాయకులు కనకరాయుడు, సలీమ్, శేఖర్ రెడ్డి, నగేష్, సిద్దు, కూతలి నాగేష్, కె. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



**కోహెడ, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** కోహెడ మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కోతలపై నిరసన తెలుపుతూ గురువారం కొత్త బస్టాండ్ వద్ద హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు ఒడితల సతీష్ కుమార్ ఆదేశాల మేర కు ధర్నా - రాస్తా రోకో ఈ కార్యక్రమం చేపట్టినట్లు బి ఆర్ ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా పాలన అని చెప్పి రాష్ట్రములో అధికారంలోకి వచ్చినాక కాంగ్రెస్ పార్టీ దేశానికి వెన్నెముక, అన్నం పెట్టె రైతులకు నిరంతరం 24 గంటల కరెంటు అందిస్తానని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వకుండా రైతుల జీవితాలతో చెలగాటమాడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులకు యూరియా బస్తాలు సరైన సమయంలో ఇవ్వకుండా రైతులను నానా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని వారు ప్రభుత్వ పని తీరు పై విరుచుకు పడ్డారు. కోహెడ మండలంలోని గ్రామాలలో లో వోల్టేజ్ ప్రాబ్లంతో ఒక రోజులో సుమారు 20 నుంచి 30 సార్లు ట్రిప్ అవుతుందని దీనివల్ల మోటర్లు కాలడం, స్టార్టర్లు పేలడం జరుగుతుందని రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం సింగల్ ఫేస్ కరెంటు కూడా 24 గంటలు కరెంటు రావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఎంతో ఆర్భాటంగా నాణ్యమైన కరెంటు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇలా చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని, ప్రస్తుతం రైతులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. అందుకే నేడు మండల కేంద్రంలో రైతుల పక్షాన నిలబడి బి.ఆర్. ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అక్కడి నుండి సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కొక్కుల సురేష్, మాజీ వైస్ ఎం పి పి రాజి రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఆవుల మహేందర్, సర్పంచులు పిల్లి బాబు, బాపురాజు, నాయకులు గుజ్జ శ్రీనివాసరెడ్డి, లోనే మల్లేశం, రామస్వామి, లక్ష్మణ్, సంధి శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్ష,కార్యదర్శులు, ముఖ్య నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాన పనికి.. సమాన స్టైఫండ్ ఏదీ?




- ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఇంటర్న్ డాక్టర్ల ధర్నా
- సుప్రీంకోర్టు ఆదేశాలున్నా తెలంగాణలో అమలు కాలేదంటున్న ఎఫ్ఎంజీ ఇంటర్న్ డాక్టర్లు
- ఐఎంజీలకు రూ.29,792.. తమకు కేవలం రూ.5 వేలేనని ఆవేదన
- అదీ ఇప్పటివరకు చెల్లించలేదని ఆరోపణ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసి, ఎఫ్ఎంజీ పరీక్షలో అర్హత సాధించి ఇంటర్న్‌షిప్ చేస్తున్న తమకు సమాన పనికి సమాన స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన ఎఫ్ఎంజీ ఇంటర్న్ డాక్టర్లు బుధవారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ముందు నిరసనకు దిగారు. ఒకే ఆసుపత్రిలో, ఒకే వార్డుల్లో, ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఐఎంజీ ఇంటర్న్ డాక్టర్లకు నెలకు రూ. 29,792 స్టైఫండ్ చెల్లిస్తుండగా, తమకు మాత్రం కేవలం రూ. 5 వేల స్టైఫండ్ మాత్రమే ఇస్తామని చెప్పడం, అదీ ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సమాన స్టైఫండ్ విషయంలో ఆదేశాలు ఇచ్చినా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి మార్పు తీసుకురాలేదని ఆరోపించారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే కలెక్టరేట్, డీఎంఈ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్కు వినతిపత్రాలు అందజేశామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సేవలను మాత్రం నిలిపివేయలేదని, తమ నిరసన శాంతియుతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించేందుకు ఆదివారం వరకు సమయం ఇస్తున్నామని, సరైన సమాధానం రాకపోతే అక్టోబర్ 13 నుంచి డీఎంఈ కార్యాలయం వద్ద సమిష్టిగా నిరసన చేపడతామని, అవసరమైతే ఎమర్జెన్సీ డ్యూటీలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, ఇంద్రాణి, నిషాంక, ఆకాష్, పూర్ణ, పూజిత, గిరి, అర్చన, ముకరం, ఆయేషా సిద్ధిఖీ, మహిపాల్, ఆయేషా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తులతో విద్యార్థుల్లో ఐక్యత డీఐఈఓ




**గీసుకొండ, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏకరూప దుస్తుల (యూనిఫాం)తో విద్యార్థుల్లో ఐక్యతా భావం పెంపొందుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ అన్నారు. గురువారం నెక్కొండ, గీసుగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 431 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలో దాదాపు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత యూనిఫాం పంపిణీ పూర్తయిందన్నారు. పండుగకు ముందు కొత్త దుస్తులు అందుకోవడం శుభసూచకమని పేర్కొన్నారు. యూనిఫాం వల్ల విద్యార్థుల మధ్య ఉన్న బేధభావాలు తొలగి, అందరూ సమానంగా కనిపించడం ద్వారా ఐక్యతా భావం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఇంటర్ విద్యార్థులకు నోట్‌బుక్స్, షూస్, బ్యాగులు అందించామని, ప్రస్తుతం యూనిఫాం కూడా ఇవ్వడంతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాళ్లు కరుణశ్రీ, శోభాదేవి, లైబ్రేరియన్లు అశోక్, రాజ్‌కుమార్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తమ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే కలెక్టరేట్, డీఎంఈ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్కు వినతిపత్రాలు అందజే శామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సేవలను మాత్రం నిలిపివేయలేదని, తమ నిరసన శాంతియుతంగా కొనసాగు తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించేందుకు ఆదివారం వరకు సమయం ఇస్తున్నామని, సరైన సమాధానం రాకపోతే అక్టోబర్ 13 నుంచి డీఎంఈ కార్యాలయం వద్ద సమిష్టిగా నిరసన చేపడతామని, అవసరమైతే ఎమర్జెన్సీ డ్యూటీలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, ఇంద్రాణి, నిషాంక, ఆకాష్, పూర్ణ, పూజిత, గిరి, అర్చన, ముకరం, ఆయేషా సిద్ధిఖీ, మహిపాల్, ఆయేషా సుల్తానా పాల్గొన్నారు.

# మత్తులోకి దించి.. బంగారం దోచేశారు!



- రూ.1.80 లక్షల సొత్తు అపహరణ.. ముగ్గురు అరెస్టు
- మట్టవాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్ వెల్లడి

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** మద్యంలో మత్తు పదార్థం కలిపి మహిళకు తాగించి, ఆమె అపస్మారక స్థితికి చేరుకున్న తర్వాత బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ అపహరించిన ఘటనలో ముగ్గురిని మట్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 1.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, లావా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న ఎంజీఎం నర్సింగ్ హాస్టల్ సమీపంలోని చెట్ల ప్రాంతానికి మహిళను మాయమాటలతో రప్పించిన నిందితులు మద్యంలో మత్తు పదార్థం కలిపి తాగించారు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో బంగారు పుస్తెలతాడు, ఉంగరం, చెవిదిద్దులు, పుస్తెలు, గుండ్లు, మొబైల్ ఫోన్ అపహరించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో క్రైం నంబర్ 537/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. ములుగు రోడ్డు జంక్షన్ వద్ద పెండెల కిషన్ (ఏ1), పల్లె సాయి శివ (ఏ2), ఆకారపు శివకుమార్ అలియాస్ లడ్డు (ఏ3)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అపరిచితులు ఇచ్చే ఆహారం, పానీయాలు తీసుకునే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మట్వాడ సీఐ కరుణాకర్ సూచించారు.

# రక్తసిక్తమైన 163వ జాతీయ రహదారి



**గోవిందరావుపేట (జనంసాక్షి) :** పసరా తాడ్వాయి 163 వ జాతీయ రహదారి మీద రోడ్డు ప్రమాదం జరిగింది. పసర తర్వాత సుమారు 5 కి.మీ. దూరంలో అటవీ ప్రాంతంలో లారీ ఒక సిఆర్పిఎఫ్ వాహనం (వ్యాన్) ఒక కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి గురైన సిఆర్‌పిఎఫ్ వాహనం ఇంచెర్ల 39వ బెటాలియన్‌కు చెందినది. ఈ ప్రమాదంలో మోగురం రామకాంత్, తండ్రి పేరు నర్సయ్య అనే సిఆర్పిఎఫ్ జవాన్ మృతి చెందారు. మరో ముగ్గురు సిఆర్పిఎఫ్ సగిరీష్ డిఓపి,ప్రేమ్ ప్రకాష్, రేడియో ఆపరేటర్ తీవ్రంగా గాయపడినారు.వారిని వెంటనే రక్షించి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడం జరిగింది.కారులో గోవిందరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రజియా బేగం, తాడ్వాయి కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న పి రమేష్ ప్రయాణిస్తున్నారు. ప్రమాదానికి గురైన కారులో నుంచి వీరిద్దరినీ రక్షించి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు సిఆర్పిఎఫ్ జవాన్ల పరిస్థితి విషమంగా ఉండగా కారులో ప్రయాణిస్తున్న వారి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉందని తెలుస్తున్నది. ఈ సహాయక చర్యలను ఫైర్ ఆఫీసర్ కె కుమారస్వామి ఆధ్వర్యంలో నాగేష్,పి రాజు,బి రాజు,సాయి కుమార్ నిర్వహించారు. పోలీసు, వైద్య సిబ్బంది, స్థానికుల సహకారంతో సహాయక, రక్షణ చర్యలు చేపట్టి, క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించారు.

# వేటగాళ్ల నుంచి రక్షకులుగా మారుస్తున్న అటవీ శాఖ



- అటవీ-వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం
- అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట
- వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు
- ఎఫ్ఆర్ఓ రెహమాన్

**ఏటూరునాగారం, అక్టోబర్ 08(జనంసాక్షి) :** అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు చురుకైన భాగస్వామ్యం కావాలని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ములుగు జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతానికి ప్రసిద్ధి చెందిందని, జిల్లాలో సుమారు 87 శాతం మేర అటవీ ప్రాంతం ఉన్న నేపథ్యంలో ములుగును అడవుల జిల్లాగా పిలవడం సముచితమని అధికారులు తెలిపారు. అడవుల కారణంగానే ఈ ప్రాంతంలో ప్రకృతి సమతుల్యత, వర్షపాతం, సహజ సౌందర్యం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అటవీ సంపద, సహజవనరులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిన ప్రాంతంగా ఏటూరునాగారం ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. గిరిజన కుంభమేళా, పర్యాటక ప్రాంతాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు, సహజ సౌందర్యం కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారని పేర్కొన్నారు. కొంతకాలంగా అటవీ ప్రాంతాల్లో జరిగిన అక్రమ ఆక్రమణలను గుర్తించి అటవీశాఖ చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. సుమారు 20,050 హెక్టార్ల మేర నష్టపోయిన అటవీ భూములను తిరిగి అటవీశాఖ ఆధీనంలోకి తీసుకునే చర్యలు చేపట్టినట్లు వివరించారు. అటవీ భూముల సంరక్షణలో భాగంగా కందకాలు తవ్వడం, రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, రానున్న కాలంలో సుమారు 650 హెక్టార్లలో అటవీకరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అడవులు క్రమంగా వెనక్కి వెళ్లకుండా వాటి విస్తీర్ణాన్ని పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వన్యప్రాణులను వేటాడటం నేరమనే విషయంపై స్థానిక ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేటకు ఉపయోగించే పరికరాలు, పనిముట్లను స్వాధీనం చేసుకునే చర్యలతో పాటు వేటగాళ్లకు అవగాహన కల్పించి వారిని వన్యప్రాణుల సంరక్షకులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే వేటకు సంబంధించిన పరికరాలు గణనీయంగా తగ్గాయని, దీనికి ప్రజలు, మీడియా అందించిన సహకారం ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. రానున్న వన్యప్రాణుల వారోత్సవాల నాటికి వేటకు సంబంధించిన పరికరాలు పూర్తిగా కనిపించని స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# రహదారుల పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



- అక్రమ ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** నగరంలో రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి నగరంలోని కల్లుమండువా జంక్షన్, చింతగట్టు క్యాంపు, రామారం, కాకతీయ యూనివర్సిటీ రెండవ గేట్, ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారుల పరిస్థితి, ట్రాఫిక్, ఆక్రమణలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేసిన బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బాలు తదితర ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆదేశించారు. రహదారుల వెంట ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఉన్నందున, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణను కూడా కలెక్టర్ పరిశీలించారు. రహదారులు, ప్రధాన కూడళ్లు, పరిసర ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. డివైడర్లు, మీడియన్స్ మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే చేయించాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ రహదారుల వెంట ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రెడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈ రవికుమార్ తో పాటు ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ను పకడ్బందీగా చేపట్టాలి



- జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08(జనంసాక్షి) :** జిల్లాలో భూముల రీ సర్వే ను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి భూముల రీ సర్వేలో తీసుకోవలసిన చర్యలపై తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, గిర్దావార్లు, గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. తహసిల్దార్ నుండి క్రింది స్థాయి రెవెన్యూ ఉద్యోగి వరకు భూముల రీ సర్వేపై అవగాహన కలిగి ఉండాలని, డి జి పి ఎస్ రోవర్స్ ద్వారా కొలతలు చేసే విధానం తెలుసుకున్నట్లయితే క్షేత్రస్థాయి సర్వేలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూముల సర్వేను ఫకట్బందిగా చేపట్టాలని, రీ సర్వే ద్వారా భవిష్యత్తులో హద్దుల వివాదాలు లేకుండా రెవెన్యూ రికార్డులు పక్కాగా నిర్వహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ కొలతల అధికారి వినయ్, తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, గిర్ధావార్లు, జి పి ఓ లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రీవెన్స్ సెల్



- కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ టౌన్ , అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ప్రజల సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించేందుకు నిర్మల్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై ఫిర్యాదుల కోసం ప్రజలు ప్రతిసారీ కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను 8317557897 వాట్సాప్ నంబర్‌కు సందేశం రూపంలో పంపవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫొటోలను పంపించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ప్రత్యేక బృందం నమోదు చేసి సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సేవను ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. అనవసరమైన లేదా తప్పుడు సందేశాలను పంపవద్దని సూచించారు. 8317557897 నంబర్‌కు ఫోన్ కాల్స్ చేయకుండా కేవలం వాట్సాప్ ద్వారా మాత్రమే ఫిర్యాదులు పంపాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్ వాలీబాల్ పోటీలకు సిఓఈ విద్యార్థి




**బెల్లంపల్లి, అక్టోబర్ 8, (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీలకు బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముడిమడుగుల హర్షిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అకిడి విజయసాగర్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ అండర్ 19 ఎస్జిఎఫ్ సెక్రటరీ బి బాబురావు రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 9 నుంచి 11 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల మండలం రంగారెడ్డి గూడలో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఎంపికవ్వాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పెద్దతూండ్లలో విద్యుత్ పోల్‌తో ఇంటికి ముప్పు



- ఒరిగిన కరెంట్ స్తంభం

**మల్హర్, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలోని శాత్రాజ్‌పల్లి ప్రధాన రహదారి పక్కన ఓ విద్యుత్ స్తంభం ఇంటివైపు ప్రమాదకరంగా ఒరిగింది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి పైకి పూర్తిగా ఒరిగిన విద్యుత్ స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇంటి యజమానితో పాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం మరింతగా ఒరిగితే విద్యుత్ తీగలు ఇంటిపై పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# స్మశాన వాటికకు దారేది?

- చివరి ప్రస్థానానికి తప్పని తిప్పలు



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 8(జనంసాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పేడ్ వీరాపురంపంచాయతీ వెంగళరావు పేట గ్రామంలో మానవత్వాన్ని ప్రశ్నించే హృదయ విధార సంఘటన దృశ్యాలు వెలుగు చూశాయి. గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లడానికి కనీసం రహదారి లేకపోవడంతో మృతదేహాన్ని గ్రామస్తులు నడుము లోతు నీళ్లలో బురదల మోస్తూ తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు అడుగుల లోతులో మృతదేహాన్ని మోసుకెళ్లిన దృశ్యం గ్రామ ప్రజల హృదయాలను కదిలించింది. అనేకసార్లు పంచాయతీ మండలాధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు అభ్యర్థించిన ఎలాంటి చర్యలు లేకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చివరికి గమ్యమైన స్మశాన వాటికకు చేరుకోవాలని స్థితి మనోత్వానికి తగినదేనా అని వశ్రీ ప్రశ్నిస్తున్నారు. తక్షణమే స్మశాన వాటికకు పక్క దారి నిర్మించాలని తాత్కాలికంగా అయినా గాదారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ సమస్యపై గ్రామీణాభివృద్ధి పంచాయతీ శాఖ వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- బతుకమ్మ సంబురాల గోడపత్రిక ఆవిష్కరణ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి పట్టణంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాల గోడపత్రికను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. జిల్లా సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 21న భూపాలపల్లి కేంద్రంగా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడపడుచుల ఆటపాటలతో వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సంబురాలు మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ అధ్యక్షతన జరుగుతాయని నిర్వాహకులు కుడుముల కుమార్, కుంట్ల ఉప్పలయ్య, బండి ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, పీసీసీ సభ్యులు మధు, సోషల్ జస్టిస్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్, పీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షులు గడ్డం రమేష్ చంద్ర పాల్గొన్నారు.

## రఘునాధగూడెం గ్రామంలో భూ రీసర్వే పనులపై క్షేత్రస్థాయి పరిశీలన



**కల్లూరు, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** కల్లూరు మండలం రఘునాధగూడెం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను సబ్ కలెక్టర్అజయ్ యాదవ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూ కొలతలు, సర్వే రికార్డుల పరిశీలన, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత సర్వే సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.అనంతరం గ్రామంలోని రైతులతో సబ్ కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి, రీసర్వే ప్రక్రియకు సంబంధించిన వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు రీసర్వే ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, భూ వివరాల సక్రమ నమోదు పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ పనులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.రైతుల నుంచి అందిన సమస్యలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీసర్వే పనులను నిర్ణీత కాలపరిమితిలో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

## యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలి



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. సూపర్ ఎల్నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదై భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నాయని పేర్కొన్నారు.
యాసంగి పంటలకు కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు.
అధిక నీటి అవసరమయ్యే వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచించారు. వరి స్థానంలో కంది, పెసర, మినుము, శనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి తక్కువ నీటి పంటలను ఎంచుకోవాలని కోరారు. బోరుబావుల నీటిని విచక్షణారహితంగా వినియోగించకుండా పంట అవసరాల మేరకే వాడాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను వినియోగించి నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలకు తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం సమిష్టిగా ఉద్యమించాలి



**సూర్యాపేట, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం సమిష్టిగా ఉద్యమించాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో గురువారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాల్గొనగా వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు.తెలంగాణ సాయుధ పోరాటాలు, భూస్వామ్య ఉద్యమాల చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బుల్లెట్ ట్రైన్ తరలింపు కుట్రలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ప్రధాన పార్టీలు బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా వెళ్లే విధంగా రాష్ట్రస్థాయిలో తీర్మానాలు చేయించి, బుల్లెట్ ట్రైన్ పక్కదోవ పట్టకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.దీక్షలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, కుసుకుంట్ల సైదులు, నాగయ్య, దుర్గయ్య ,నర్సిరెడ్డి, సింహాద్రి, ప్రవీణ్, శ్రీప్రియ, కిరణ్ శ్రీహాన్ పాల్గొన్నారు.వారికి చలమల్ల నరసింహ, జర్నలిస్టు భూపతి రాములు, వెలుగు వనిత, సట్టు నాగయ్య, భయ్యా మల్లికార్జున్ , శోభ, మాధవరెడ్డి, నర్సయ్య, తదితరులు సంఘీభావం తెలిపారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి




**శివ్వంపేట, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం శివ్వంపేట పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్లోని పరిపాలనా వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ తీరును పరిశీలించారు. క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, కేసు డైరీలు, ముద్దాయిల రిమాండ్ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్లో ఉన్న యూఐ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లు, సీసీ నంబర్లు రాని కేసుల వివరాలను ఎస్సై మధుకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన దర్యాప్తు చేపట్టి కేసుల ఫైళ్లను త్వరితగతిన కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది మూడు కేసుల్లో జీవిత ఖైదు పడేలా తీర్పులు రావడంలో కృషి చేసిన ఎస్సై మధుకర్ రెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, సీసీటీవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, అక్రమ మద్యం, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, ఆన్లైన్ మోసాలకు గురైన వారు వెంటనే 1930కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ వెంకటరాజు గౌడ్, ఎస్బీ సీఐ సందీప్ రెడ్డి, ఎస్సై మధుకర్ రెడ్డి, ఏఎస్ఐ భారతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి కొరతతో కరువు కోరల్లో అన్నదాతలు

- ఆకాశాన్ని అంటుతున్న పండ్లు, కూరగాయల ధరలు
- అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు చిన్నపిల్లలు



**మణుగూరు, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ఎల్నినో ప్రభావం వల్ల ప్రజలు రైతులు నీటి సమస్యతో ఎండ వేడి తో నీరు లేక దిగుబడి రాక తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాభావ పరిస్థితులు, తీవ్రమైన కరువు భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీని వల్ల అటు సామాన్య ప్రజలు, ఇటు అన్నదాతలు ఆరోగ్య ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శీతాకాలంలో ఎండ వేడి వల్ల వేసవిని తలపిస్తోంది. ఎండవేడికి ఎన్ని నీరు తాగిన ఎంత తిండితిన్న ఉక్కపోతతో నీరసించి పోతున్నారు. బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. ఇది ఇలానే ఉంటే వేసవిలో పరిస్థితి ఏంటని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### తీవ్రమైన ఉష్ణోగ్రతలతో ఆరోగ్య సమస్యలు

ఎల్ నినో వల్ల సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వడగాలులు వీస్తాయి. దీని వల్ల పిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఉష్ణతాపం ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎల్ నినో కారణంగా రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో మైళ్ల దూరం వెళ్లి లేదా ట్యాంకర్లపై ఆధారపడి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ధరలు ఎక్కువవుతాయి. వ్యవసాయ దిగుబడులు తగ్గడం వల్ల మార్కెట్లో కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగిపోయి (ధరల ద్రవ్యోల్బణం), సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది.సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పంటలు ఎండిపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం

వ్యవసాయ రంగంలో ఏ పంట కైనా ప్రధానంగా నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణించడంతో చేతికొచ్చిన పంటలు (వరి, మొక్కజొన్న వంటివి) కళ్ల ముందే ఎండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో దిగుబడి రాదనే దిగులుతో పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. వర్షాలు లేక బావులు, బోరుబావుల్లో నీటి మట్టాలు విపరీతంగా పడిపోతున్నాయి. నీటి కోసం రైతులు మరిన్ని లోతు గల బోర్లు వేస్తూ తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారు. పొలాలను కాపాడుకోవడానికి రైతులంతా ఒకేసారి వ్యవసాయ మోటార్లను ఆన్ చేయడంతో విద్యుత్ లైన్లపై ఒత్తిడి పెరిగి, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ ట్రిప్పింగ్లు కావడం, ట్రాన్స్ఫార్మర్లు పేలిపోవడం మోటార్లు కాలిపోవడంతో రైతులకు అదనపు ఖర్చులు పెరిగిపోతున్నాయి. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత వల్ల పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడుతోంది. దాణా ధరలు పెరగడం వల్ల పశుపోషకులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. వేడి తట్టుకోలేక పశువుల్లో పాలు ఇచ్చే సామర్థ్యం కూడా తగ్గుతోంది.రైతుల జీవనోపాధిని తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. దీనిని తట్టుకోవడానికి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని నీటి సంరక్షణ పద్ధతులు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కాలంతో పాటు వచ్చే ఎండ వేడి కంటే వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే వేడి చాలా ప్రమాదకరం. ఒకేసారి ఎండ పెరగడం తగ్గటం వల్ల శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. గుండె జబ్బులు, బీపీ, మధుమేహం ఉన్నవారు ఎండల వల్ల త్వరగా నీరసించిపోతారు.మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో వీలైనంత వరకు బయటకు వెళ్లడం ఆపాలి. ముఖ్యంగా పిల్లలు వృద్ధులు గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు పాటించాలి. పుచ్చకాయ, కర్బూజ, కీరదోస, నారింజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి.టీ, కాఫీలు, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్ అల్కహాల్ను పూర్తిగా తగ్గించాలి. ఇవి శరీరంలో ఉన్న నీటి శాతాన్ని తగ్గిస్తుంది.పరిస్థితి తీవ్రంగా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి.

**ఎం.రామకృష్ణ సూపరింటెండెంట్ ఏరియా ఆసుపత్రి మణుగూరు**

## బీఆర్ఎస్ విజయం కోసం కలిసి పని చేయాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** రాబోయే పట్టభద్రుల ఖమ్మం, నల్గొండ,వరంగల్ (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి అభ్యర్థి విజయం కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడి పనిచేయాలని మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో దాదాపు ప్రస్తుతం 28,500 ఓట్లు ఉన్నాయని, ప్రతి 100 ఓట్లకు ఒక సమన్వయకర్త (కోఆర్డినేటర్) చొప్పున అదనంగా 325 మందికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (రా×=) తరహాలోనే ఈసారి కూడా ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రుల వివరాలు సేకరించాలన్నారు.డివిజన్ల వారీగా ప్రత్యేకంగా టెంట్లు, గుడారాలు, లేదా పార్టీ కార్యాలయాల వద్ద ఎన్రోల్మెంట్ క్యాంపులు ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను ఉధృతం చేస్తున్నామని చెప్పారు. తాను స్వయంగా వచ్చే నెల రోజుల్లో కనీసం వారానికి రెండు రోజులు ఈ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటానని ప్రకటించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన ప్రైవేట్ సంస్థల ఉద్యోగులను గుర్తించి ప్రత్యక్షంగా కలిసి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి గారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ముఖ్యంగా ఖమ్మం నియోజకవర్గం నుంచే అత్యధికంగా గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదు చేయించి విజయంలో కీలక పాత్ర పోషించామని గుర్తుచేశారు. అదే ఉత్సాహంతో ఈసారి కూడా పని చేయాలన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు నాంది అని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ సాధించే విజయం రాష్ట్రంలో సరికొత్త రాజకీయ ట్రెండ్కు శ్రీకారం చుడుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కృష్ణ,బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు,ఖమర్,మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ,షేక్ మక్బుల్,శీలంశెట్టి వీరభద్రం, నాగండ్ల కోటేశ్వరరావు, జ్యోతి రెడ్డి, పల్లా రోజ్లీనా,కమల, బుడిగం శ్రీను, బుర్రి వెంకటేశ్వర్లు,బిక్కసాని ప్రశాంతి జస్వంత్, పసుమర్తి రామ్మోహన్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, నాయకులు మెంతుల శ్రీశైలం,కొత్త వెంకటేశ్వర్రావు పాషా,బత్తుల మురళి, వీరు నాయక్,పిన్ని కోటేశ్వరరావు, గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, మెంటం రామారావు,ప్రదీప్, సర్పంచ్లు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరిస్తాం



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** భూ హక్కులకు సంబంధించిన సమస్యలను పాత రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ నారాయణపురంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితి, సాగులో ఉన్న రైతులు, విస్తీర్ణ వివరాలను గుర్తించినట్లు తెలిపారు. పాత పహాణీలు, సీలింగ్ భూములు, పట్టాలు, భూ బదలాయింపుల రికార్డులను పరిశీలించి హక్కులపై స్పష్టత తీసుకువస్తామన్నారు. సర్వే అనంతరం భూ యజమానులకు విస్తీర్ణం, హక్కుల వివరాలతో నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. అభ్యంతరాలు ఉన్న రైతులు ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ రీ-సర్వేకు సంబంధించిన దరఖాస్తులను అక్టోబర్ 15 వరకు స్వీకరిస్తామని తెలిపారు. అందుబాటులో ఉన్న ఆధారాలు, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు పాత పత్రాలు, కొనుగోలు, వారసత్వం, భూ బదలాయింపులకు సంబంధించిన ఆధారాలను అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి పెద్దపీట

- రూ.10 లక్షలతో నిర్మించిన భవనం ప్రారంభం



**చింతపల్లి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** చింతపల్లి మండలం ధైర్యపురి తండాలో రూ.10 లక్షల (విబిజిఆర్ఏఎంజి)నిధులతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ నిధులను వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతంతో గ్రామీణ మహిళలకు ఆర్థిక అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. పొదుపు, రుణాలు, చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో సంఘ సమావేశాలు, శిక్షణలు, ఇతర కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందన్నారు.మహిళల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, పేదల ఆర్థిక పురోగతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బాలు నాయక్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో దొంతం అలివేలు సంజీవరెడ్డి, జాటావత్ హరినాయక్, ముచర్ల గిరి, ఎరుకల వెంకటయ్యగౌడ్, కొండూరు పవన్కుమార్, గ్రామ సర్పంచ్ వాంకుడోత్ అనిత దాస్ నాయక్,వాంకుడోత్ రవినాయక్, మాస భాస్కర్, జంగిటి నర్సింహా, యాచారపు యాదిగౌడ్, గుండ్లపల్లి నర్సిరెడ్డి, కాయితి జితేందర్రెడ్డి, దాసరి శ్రీనివాస్యాదవ్, గుణమోని కొండల్యాదవ్, మహ్మద్ ఖలీల్తో పాటు అధికారులు, మార్కెట్ డైరెక్టర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దాలి

- ప్రతి గ్రామపంచాయతీలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆర్. పాండు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్, జోష్ ఉన్నతస్థాయి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, సత్వర చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో క్షయ లక్షణాలు, పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షయ నిర్మూలన కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. లలితాదేవి మాట్లాడుతూ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద జిల్లాలో ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 1,750 క్షయ కేసులు నమోదయ్యాయని, బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఏడు పనిచేస్తున్న ఎక్స్రే యంత్రాలు అందుబాటులో ఉండగా, జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నిర్దేశిత లక్ష్యంలో 109 శాతం ఎక్స్రే వినియోగం సాధించినట్లు తెలిపారు. క్షయ బాధితులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం అందించడంతో పాటు పోషకాహార సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా క్షయ వ్యాధి ప్రమాదం ఎక్కువగా ఉన్న 144 గ్రామాలను గుర్తించి, నిక్షయ్ శిబిరాల ద్వారా ప్రజలకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. క్షేత్రస్థాయి కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు మండల స్థాయిలో ఎంపీడీవోల నేతృత్వంలో మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్సీసీ విద్యార్థులతో జోష్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా క్షయ రహిత గ్రామపంచాయతీలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు, ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గుర్తించిన 41 క్షయ రహిత గ్రామాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అదనపు కలెక్టర్ ఆర్. పాండు ఎంపీడీవోలు, సర్పంచ్లకు అందజేశారు. మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్సీసీ విద్యార్థులకు కూడా ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం క్షయ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి సి.హెచ్. అరుణకుమారి, జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్సీసీ యూనిట్ కమాండర్, ఎంపీడీవోలు, సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.



## వయోవృద్ధుల అనుభవం సమాజానికి ఎంతో విలువైనది

### ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 8 (జనంసాక్షి)**
వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వయోవృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా 80 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వయోవృద్ధులను కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమాజ నిర్మాణంలో వయోవృద్ధులు అందించిన సేవలను, వారి అనుభవం, జ్ఞానాన్ని కొనియాడారు. వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వయో వృద్ధుల అనుభవాలు, సూచనలు యువతకు ఎంతో మార్గదర్శకంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వయోవృద్ధుల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా వారికి అవసరమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు గౌరవప్రదమైన జీవితం గడిపేలా సమాజం అండగా నిలవాలని కోరారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోదావరి, పున్న రాజేశ్వర్, రాజన్న, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ప్రతినిధులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## సిండికేట్ వ్యవహారమో.. ధరల పతనమో!

### కోతకు వచ్చిన పొలాలను కోయకుండా కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఎదురుచూపులు



**సిరికొండ, అక్టోబర్ 8 (జనం సాక్షి):**
సిరికొండ మండలంలో పచ్చి వడ్ల ధరలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు పచ్చి వడ్లకు మంచి ధరలు లభించడంతో రైతుల్లో ఆశలు చిగురించగా.. ప్రస్తుతం ధరలు తగ్గడంతో పరిస్థితి తారుమారైంది. ధర తగ్గడంతో కోతకు వచ్చిన పొలాలను సైతం కోయకుండా కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.
సోషల్ మీడియాలో పచ్చి వడ్లకు మంచి ధరలు వస్తున్నాయని, రైతులకు భారీగా లాభాలు వస్తున్నాయంటూ ప్రచారం జరగడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. అయితే ఆ తర్వాత ధరలు ఒక్కసారిగా తగ్గడంతో తాము నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ధరల ప్రచారం ప్రభావమో.. లేక మార్కెట్‌లో రైస్ మిల్లర్ల వ్యవహారమో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు.
రైస్ మిల్లర్లు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ధరలను తగ్గిస్తున్నారనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఒకరితో ఒకరు సమన్వయంతో ఒకే తరహా ధరలు నిర్ణయిస్తున్నారని, దీంతో రైతులకు తమ పంటను అమ్ముకునే అవకాశం లేకుండా పోతోందని వారు వాపోతున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు మార్కెట్ పరిస్థితిని పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు.
మరోవైపు వరికోతల సీజన్‌లో రైతులపై ఖర్చులు భారీగా పెరిగాయి. వరికోత యంత్రాల అద్దెలు, కూలీల ఖర్చులు, ధాన్యం రవాణా, హమాలీ చార్జీలు తదితర ఖర్చులు రైతులకు అదనపు భారంగా మారాయి. పంట సాగు కోసం చేసిన అప్పులు, పెట్టుబడులు తిరిగి రావాల్సి ఉండగా.. చివరి దశలో ధర తగ్గడంతో చేతికి వచ్చే ఆదాయం మరింత తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పంటను కోసి వెంటనే అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో పొలాల్లోనే ధాన్యం నిల్వ చేయాల్సి వస్తుందని, వర్షాలు కురిస్తే మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంటి వద్ద ధాన్యం నిల్వ చేసుకునే సౌకర్యం లేని చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది.
ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లపై ఆధారపడాల్సి రావడంతో ధర విషయంలో తమకు నష్టం జరుగుతోందని చెబుతున్నారు.
ప్రభుత్వం వెంటనే మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పచ్చి వడ్ల ధరలపై అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, మధ్యవర్తులు లేదా మిల్లర్లు కుమ్మక్కై ధరలను తగ్గిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి, రైతులకు న్యాయమైన ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## కేజీబీవీ నిర్వహణపై కలెక్టర్ కన్నెర్ర.. లోటుపాట్లకు చెక్!

- పెద్దవాల్గోట్ కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ..
- 10 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశం

**సిరికొండ అక్టోబర్ 8(జనంసాక్షి):**
నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్‌రూమ్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల ఆరోగ్యానికి ఇబ్బందులు తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సిబ్బంది, విద్యార్థినుల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.. ఎఫ్ఆర్ఎస్ విధానం అమలుపై ఆరా తీశారు. హాజరు నమోదులో తేడాలు గుర్తించడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వెంటనే చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.పాఠశాలలో ఆహార పదార్థాల నాణ్యత, మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించిన కలెక్టర్.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని, మరమ్మతులు సాధ్యం కాకపోతే కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు. పది రోజుల తర్వాత తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటిలోగా గుర్తించిన అన్ని లోటుపాట్లను సరిచేయాలని సూచించారు.సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మండల అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ బి. రవీందర్‌రావు, ఎంపీడీవో మహ్మద్ ఆరిఫ్ అహ్మద్, ఎంఈవో రాములు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

## రాహుల్ – ప్రియాంక లపై దాడికి నిరసనగా కోమటిరెడ్డి నిరాహారదీక్ష

- ఓటు హక్కును హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం పై పోరాటం ఆగదు
- రాజ్యాంగ పరిరక్షణ కోసమే మా నాయకుల పోరాటం
- జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :**
మోదీ కనుసన్నల్లో జరుగుతున్న ఈసీ అక్రమాలకు నిరసనగా శాంతియుతంగా ధర్నా చేసిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లపై పోలీసులచే దాడి చేయించిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముకరంపుర లోని తన కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... లోక్ సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మోదీ కనుసన్నల్లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చేసిన తప్పిదాల పై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసులచే దాడి చేపించి అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని అటువంటి ఓటు హక్కును కేంద్రం ప్రభుత్వం సీఈసీ ని అడ్డుపెట్టుకుని అన్యాయం చేస్తోందని నరేందర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి దేశ ప్రజల పూర్తి




మద్దతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఫాం 6 లో 2002 లో ఓటు హక్కు పొందిన వారి వివరాలు నమోదు చేయాలని ఉందని అప్పుడు ఓటు వేయని వారి కుటుంబాల పరిస్థితేంటని, బోగస్ ఫాం 7 ద్వారా బోగస్ సంతకాలు పెట్టి బీజేపీ నాయకులు ఓట్లు కొల్లగొడుతున్నారని నరేందర్ రెడ్డి ఆరోపించారు. అన్ని అక్రమాలకు జ్ఞానేశ్ కుమార్ మద్దతు ఉందని, అందుకే జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగుతే అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు మేం సిద్ధమని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నిరాహార దీక్ష లో ఎండి. తాజ్, కార్పోరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, నిహాల్ అహ్మద్, ఎండి చాంద్, ముక్క భాస్కర్, లాయక్, షబానా మహమ్మద్, కుర్ర పోచయ్య, ముల్కల కవిత, అస్థాపురం తిరుమల, జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, మిరాజ్, జీడి రమేష్, అస్థాపురం రమేష్, గోనె స్వప్న, జిలకర రమేష్, సాయిరాం, భారీ, బషీర్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థుల ఎంపిక

ఎస్జీఎఫ్ అండర్?17 రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు

**సిరికొండ అక్టోబర్ 8(జనం సాక్షి ):** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తూంపల్లి పాఠశాల విద్యార్థులు ఎస్జీఎఫ్ అండర్?17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎస్. నగేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ ఎంపిక పోటీల్లో తూంపల్లి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బి. జస్వంత్, ఆర్. తరుణ్, ఎల్. సింహాద్రి, ఎం. కిరణ్, బి. దినేష్, ఆర్. హర్షిత్ ఎంపికైనట్లు పీడీ ఎస్. నగేష్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ పి. రాములు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. మనోహర్, ఉపాధ్యాయులు, సర్పంచ్ రాజేందర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఏఏపీసీ చైర్మన్ లత అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఒక్క సారి ఆలోచిస్తే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చు

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం టౌన్ అక్టోబర్ (8) జనంసాక్షి**
ఒక్క సారి ఆలోచిస్తే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం కేంద్రహోంశాఖ ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ భద్రత పై విస్తృతంగా. అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ మాసంలో నిర్వహిస్తున్న. పాజ్ పర్ సెఫ్టీ- థింక్- వెరిఫై .అనే.నినాదం తో రూపొందిన పోస్టర్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ ప్రారంభించారు ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయనిప్రజలు అప్రమత్తంగా వ్యవహరించటం ద్వారా అనేక మోసాలను ముందుగానే నివారించవచ్చని తెలిపారు తెలియని. వ్యక్తుల నుండి. వచ్చే ఫోన్ కాళ్ళు మెసేజ్ లు .ఈ మెయిల్స్.సోషల్.మీడియా లింకులను తొందరపడి నమ్మవద్దని సూచించారు నీబిజూ.జూతిని.ఇలల పాస్ వర్డు లు బ్యాంకు ఖాతా వివరాలు వ్యక్తిగత సమాచారం ఎవరికి వెల్లడించ వద్దని హెచ్చరించారుఏదేని అనుమానాస్పద.లింక్. లేదా మెసేజ్ వచ్చినపుడు తొందరపడకుండాజూజీబీబవ –బిష్త్రతినిని' బిలవతీతిటజీఎ (ఆగండి బిఆలోచించండి. బిధృవీకరించండి సైబర్ నేరాలకు చెక్ పెట్టండి ) సూత్రాన్ని పాటించాలని. సూచించారు పెట్టుబడులు ఉద్యోగాలు.రుణాలు.బహుమతులు.డిజిటల్ అరెస్టులు ఎఎఞ. తదితర పేర్ల తో.జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సైబర్ మోసానికి గురై.నట్లయితే.వెంటనే.1930సైబర్.క్రైమ్.హెల్ప్.లైన్ కు సమాచారం అందించాలని అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా పిర్యాదు చేయాలని సూచించారు తొందరపాటు నిర్ణయం సైబర్ మోసానికి దారి తీయవచ్చు ఒకసారి ఆగి.ఆలోచించి.ధృవీకరించిన తర్వాత నే స్పందించండి.అనే.సందేశాన్ని.ప్రజల్లోకి.విస్తృతంగా తీసుకెళ్లేందుకు. అక్టోబర్ నెలంతా పాఠశాలలు.కళాశాలలు .మార్కెట్లు. అపార్ట్మెంట్.సంఘాలు.రవాణా కేంద్రాలు ప్రజలు అధికంగా ప్రయాణించే ప్రదేశాలు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీసులు పోలీస్ స్టేషన్ ఏ సి పి ఫణీందర్ సిబ్బంది పాల్గొన్నారు





## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

### సుమారు 1200 లీటర్ల బెల్లం పానకం పాటు 20 లీటర్ల గుడుంబా ధ్వంసం

**మంథని, అక్టోబర్ 08, (జనంసాక్షి) :**
దసరా పండుగను పురస్కరించుకొని కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, పెద్దపెల్లి డిపిఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు మంథని పట్టణంలో ఉన్నటువంటి బోయిన్ పేట నివాస గృహాలకు ఆనుకొని ఉన్నటువంటి వాగు పరిసర ప్రాంతాలు, అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం మంథని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పెద్దపెల్లి ఎక్సైజ్ సీఐ రజిత రెడ్డి అలాగే పెద్దపల్లి డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్, మంథని ఎక్సైజ్ ఎస్ఐ బాలు నాయక్ కలిసి సంయుక్తంగా గుడుంబా స్థావరాలు పై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. ఇట్టి దాడులలో సుమారు 1200 లీటర్ల పులిసిన బెల్లం పానకంతో పాటు 20 లీటర్ల నాటు సారాయిని ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి ఆ వ్యక్తుల యొక్క వివరాలను సేకరించే పనిలో ఉన్నట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా బోయిన్పేట పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి కొంతమంది అనుమానిత పేర్లను సేకరించామని, అనుమానితులను వారి ఇండ్లను కూడా గుర్తించామని, అట్టి వారిపై రాబోయే రోజులలో ఎక్సైజ్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తుల పైన పైన బోయిన్ పేటలో రెండు లేదా మూడు కేసులు గతంలో నమోదు చేయబడి ఉన్నాయని ఇప్పుడు మరొక కేసు నమోదు జరిగినట్ట అయితే వారందరిపై పిడి యాక్ట్ పెట్టడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. అంతేకాకుండా బేగంపేటపై ప్రత్యేక దృష్టి పెట్టామని బేగంపేటలో కూడా పెద్ద ఎత్తున గుడుంబా స్థావరాలు ఉన్నాయని చెప్పేసి మాకు సమాచారం ఉందని దానికి సంబంధించి కూడా పూర్తి సమాచారం సేకరిస్తున్నామని అక్కడి వారిపై కూడా ఎక్సైజ్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటాము అని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఇట్టి దాడులలో మంథని సిబ్బందితో పాటుగా పెద్దపల్లి ఎక్సైజ్ సిబ్బంది, పెద్దపల్లి టాస్కోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా ముందుకు వెళ్లాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్నసిరిసిల్ల బ్యూరో,అక్టోబర్08(జనం సాక్షి);**
టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా వైద్య సిబ్బంది పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో సర్పంచులు, వైద్య సిబ్బందికి నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా టీబీ లక్షణాలు, వైద్య పరీక్షలు, మందులు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ఎంపికైన 20 గ్రామ పంచాయతీల సర్పంచులు, వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించి,అభినందించారు. 20 మంది క్షయ బాధితులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పిలుపు నిచ్చారు. టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు.సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని, వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. పూర్తిగా నయం అయ్యేవరకు క్షయ బాధితులపై పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. టీబీ రహిత గ్రామాలు బోయినపల్లి మండలం రామన్నపేట, దేశాయిపల్లి, శాభాష్ పల్లి, ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లె, ఆరెపల్లి, గంభీరావుపేట మండలం హీరాలాల్ తండా, పొన్నాలపల్లి, కోనరావుపేట మండలం గొల్లపల్లి, శివంగాలపల్లి, మర్త న్నపేట, ముస్తాబాద్ మండలం



గోపాలపల్లి, రుద్రంగి మండలం రూప్లానాయక్ తండా, సర్పంచ్ తండా, తంగళ్ళపల్లి మండలం పాపయ్యపల్లి, వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా, బావు సింగ్ నాయక్ తండా, ఎర్రగడ్డ తండా, జవహర్ లాల్ నాయక్ తండా, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామాలు ఎంపికయ్యాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలాల్రిన్హోడ్, వైద్యులు, సర్పంచులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలికాలంలోను వీడని తాగునీరు సమస్య

- నీటి కోసం పల్లెల్లో అవస్థలు..
- గ్రామాల్లో బిందెలతో నీరు మోసుకుంటున్న గ్రామస్తులు..
- కొన్ని చోట్ల వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా..
- తాగునీటి సమస్యపై స్పెషల్ మీటింగ్ పెడుతున్నాం అంటున్న ఎంపీడీవో రాజేశ్వర్..





**గాంధారి అక్టోబర్ 8 జనంసాక్షి :**
చలికాలంలో కూడా తాగునీటి తిప్పలు తప్పడం లేదు మేజర్ గ్రామపంచాయతీ అయిన గాంధారి మండలంలో 45 గ్రామపంచాయతీ పరిధిలో వివిధ గ్రామాల్లో మంచినీరు సమస్యతో కొన్ని గ్రామాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంకొన్ని గ్రామాల్లో నీరు దొరికే ప్రాంతం నుండి నీటిని మోసుకొస్తున్నారు.

**నీటి కోసం పల్లెల్లో అవస్థలు...**
ఎండాకాలంలోనే కాకుండా చలికాలంలో కూడా నీటి కోసం పల్లెల్లో అవస్థలు పడుతూనే ఉన్నారు. కేవలం ఎండాకాలంలోనే ఈ సమస్య ఎక్కువగా ఉండేది కానీ చలికాలంలో కూడా ఈ సమస్య తీవ్ర రూపం దాల్చింది వివిధ గ్రామాల్లో నీటి కోసం సుదూర ప్రాంతాల నుండి బిందెలను నెత్తి మీద పెట్టుకొని నీటి కోసం పాట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇంకొంతమంది తమ యొక్క ద్విచక్ర వాహనంపై డబ్బాలతో నీరు దొరికే ప్రాంతం నుండి నీటిని తీసుకుని వస్తున్నారు.

**కొన్నిచోట్ల వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా**
కొన్నిచోట్ల వివిధ గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీరు లేని చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు అయితే మిషన్ భగీరథ నీరు ఇంటింటికి చేరకపోవడం కొన్నిచోట్ల బోరు మోటర్లు కూడా కొన్ని గ్రామాల్లో కొన్ని గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సమస్య తలెత్తింది. ఎప్పటికప్పుడు ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని అధికారులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే చలి కాలంలోనూ నీటి సమస్య లేకుండా ఉండేదని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటి సమస్యపై స్పెషల్ మీటింగ్ పెడుతున్నాం ఎంపీడీవో రాజేశ్వర్..**
గాంధారి మండల కేంద్రంలోని 45 గ్రామపంచాయతీ పరిధిలో కొన్నిచోట్ల తాగునీటి సమస్య ఉందని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని సెక్రటరీ అధికారులను మరియు మిషన్ భగీరథ అధికారులతో కలిసి తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా స్పెషల్ మీటింగ్ పెడుతున్నామని దీంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమం అవుతుందని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు.



## నారాయణపూర్ సర్పంచుకు గోల్డ్ ప్రశంస పత్రం

**గంగాధర, అక్టోబర్ 8 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో గురువారం జరిగిన 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామాన్ని టీబీ ముక్త్ గ్రామపంచాయతీగా ప్రకటించారు. ఈ సందర్భంగా గోల్డ్ ప్రశంస పత్రాన్ని సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మీ మధుకు అందజేశారు. అలాగే చిన్న ఆచంపల్లి గ్రామపంచాయతీకి సిల్వర్ ప్రశంస పత్రాన్ని సర్పంచ్ గుడి రజిని ప్రవీణ్‌రెడ్డికి అందజేశారు. డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ సీఈఓ దమ్మని రాము, డీపీఓ, జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

**కరీంనగర్ (జనంసాక్షి ) :** దుర్శేడ్ గ్రామానికి చెందిన కర్ర అజయ్ గత సంవత్సరం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో తన ఒప్పో సెల్



ఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినాడు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను ట్రేస్ చేసి మంథనిలోపట్టుకోవడం జరిగింది.అట్టి ఫోను యజమాని అయిన కర్ర అజయ్‌కు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి సెల్ ఫోను అందజేశారు.

# అంబేద్కర్ ఇచ్చిన ఓటును బీజేపీ దొంగిలిస్తోంది

- జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి
- ఓట్ల దొంగతనంపై మరో స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలకాలి
- కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఫైర్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద భారత ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓట్ చోరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీల పై జరిగిన లాఠీచార్జ్ ను నిరసిస్తూ, నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన పవిత్రమైన ఓటు హక్కును దొంగతనం చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్ ను ఈసీగా నియమించింది. ఇది దేశంలోనే అత్యంత పెద్ద దోపిడీ. గతంలో సుప్రీంకోర్టు జడ్జితో కూడిన ముగ్గురి కమిటీతో నియమించబడే ఈసీని, సుప్రీంకోర్టు జడ్జిని తొలగించి కేంద్ర మంత్రిని పెట్టుకొని నియమించారు. ఆ కృతజ్ఞతతో జ్ఞానేష్ కుమార్ లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లను తొలగిస్తూ బీజేపీ గెలుపుకు సహకరిస్తున్నారని, ఇదే విషయం పై అదే కమిషన్ లోని మిగతా ఇద్దరు సభ్యులు 14 సార్లు డిసెంట్ ఇచ్చినా నియంతలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంటనే జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ దేశంలో బంగారు దొంగలను, నోట్ల దొంగలను చూశాం కానీ ఓటును దొంగిలించే దొంగలను ఇప్పుడే చూస్తున్నామని, ఇది మరో స్వాతంత్ర్య సమర పోరాటానికి నాంది అని, ఇవాళ జన్ జీ యువత మాత్రమే కాదు, 8 ఏళ్ల జెన్ ఆల్ఫా పిల్లవాడు కూడా ఈ దోపిడీ గురించి మాట్లాడుతున్నాడంటే దేశం ఎటు పోతోందో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ. చైర్మన్ ఆకుల నరసయ్య, మల్లికార్జున రాజేందర్, కల్ల పెల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగం, చాడ గోండ బుచ్చిరెడ్డి, భాస్కర్ నాయక్, బోనాల శ్రీనివాస్, గంట కళ్యాణి, ఫహాద్, ఆకుల ఉదయ్, కామ్రెడ్డి రాంరెడ్డి, అహమ్మద్ అలీ, వెన్నం రజిత రెడ్డి, కోడూరు రవీందర్ గౌడ్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు క్యాన్సర్ చికిత్స

**ఈ చికిత్సా విధానంపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి**

**క్యాన్సర్ చిన్న పిల్లలకు జన్మించిన నాటి నుండి 18 సంవత్సరాలు వరకు వచ్చే అవకాశాలు**

**యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ డా. పరిణిత రెడ్డి గుత్తా**




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత 20 సంవత్సరాలు గా చిన్న పిల్లలకు క్యాన్సర్ చికిత్స అందించడంలో అనుభవం కలిగిన యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ డాక్టర్ పరిణిత రెడ్డి గుత్తా (పీడియాట్రిక్ ఆంకాలజీ, హెమటాలజీ, క్లినికల్ డైరెక్టర్ అండ్ హెచ్ఓడి )మాట్లాడుతూ... పిల్లలకు వచ్చే క్యాన్సర్, క్యాన్సర్ చికిత్స పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్నపిల్లలకు క్యాన్సర్ అనేది అరుదైన విషయం కాకపోతే దీని గురించి అవగాహన చాలా ముఖ్యం అని, పూర్తిగా నయం అయ్యే అవకాశాలు చాలా మెరుగుగా ఉంటాయి. జన్మించిన నాటి నుండి 18 సంవత్సరాలు వరకు వచ్చే అవకాశాలు ఉంటాయని, చిన్న పిల్లలకు వచ్చే క్యాన్సర్ చికిత్స విధానాలు, పెద్దవారికి వచ్చే క్యాన్సర్ లకు చాలా తేడా ఉంటుందని అన్నారు. పిల్ల క్యాన్సర్ చికిత్సలన్నింటిలోనూ శస్త్రచికిత్స, కీమోథెరపీ రేడియేషన్, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంట్ (ఎముక మజ్జ మార్పిడి) ఉపయోగిస్తారు. మెరుగైన రిజల్ట్ రావడం కోసం చిన్న పిల్లలకి నిర్దేశించబడిన చిన్న పిల్లల డాక్టర్ క్యాన్సర్ స్పెషలిస్ట్ పర్యవేక్షణలో చికిత్స జరగాలని తెలిపారు.

**పిల్లలకు క్యాన్సర్ వచ్చే ముందు వాటి లక్షణాలు**

పిల్లల్లో నిరంతరం తగ్గని జ్వరం, రక్తస్రావం, కీళ్ల నొప్పులు, రక్తలేమి, కంతలు, తగ్గని వాంతులు, కొత్తగా మెల్లకన్ను రావడం, రాత్రి వేళలో తగ్గని తలనొప్పి వంటివి లక్షణాలు ఉంటే వెంటనే తల్లిదండ్రులు సంబంధించిన డాక్టర్ ను సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు. సెప్టెంబర్ నెల చిల్డ్రన్స్ ఎవర్నెస్ నెల కాబట్టి దీంట్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ, సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, హరీష్ రెడ్డి పాల్గొన్నారు.



## కంపెల్లి నర్సయ్యకు కలెక్టర్ ఆర్థిక సాయం

**ముస్తాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి కలెక్టర్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామ సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం.డి. ఫారూక్ చేతుల మీదుగా కంపెల్లి నర్సయ్యకు ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కంపెల్లి నర్సయ్య గత 25 సంవత్సరాలుగా చీకోడు గ్రామ పంచాయతీలో నల్ల ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉండగా, నిరుపేద కుటుంబం కావడంతో కనీసం ఉండేందుకు సొంత ఇల్లు కూడా లేదని గ్రామస్తులు తెలిపారు. ఉద్యమ నాయకుడిగా, ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిగా పేరున్న నర్సయ్య ఎవరి వద్దా నయాపైసా ఆశించకుండా గ్రామంలో కష్టపడి పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడినప్పటికీ గ్రామానికి సేవలందిస్తున్న నర్సయ్య పరిస్థితిని గుర్తించిన కలెక్టర్ రూ.50 వేల ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## సింగిల్ విండో నూతన పాలకవర్గం రైతులకు అండగా నిలవాలి

**రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**మేడిపల్లి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :**

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం మేడిపల్లి మండలం పోరుమళ్ళ, వల్లంపల్లి, మేడిపల్లి, భీమారం పీఏసీఎస్ నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు,పాలకవర్గ సభ్యుల అభినందన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటు రైతులకు సేవ చేయాలనే సంకల్పం ఉన్నవారికి బాధ్యతలు అప్పగించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నూతన పాలకవర్గం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని సూచించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అడ్వైజర్ కమిటీ మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్,పోరుమల్ల సింగిల్ విండో అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్, మేడిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు ఎద్మల రాజేందర్ రెడ్డి, వల్లంపల్లి సింగిల్ విండో అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, భీమారం సింగిల్ విండో అధ్యక్షులు ఉరుమడ్ల లక్ష్మణ్, మేడిపల్లి మండల అధ్యక్షులు బద్దం రాజేందర్ రెడ్డి, భీమారం మండల అధ్యక్షులు నీరటి మల్లేశం సింగిల్ విండో డైరెక్టర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## నిలిచిన బస్సులు.. ఆగని ఆందోళన

**గన్నేరువరంలో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు**

**గన్నేరువరం, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గన్నేరువరం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గన్నేరువరం నుండి బెజ్జంకి, సిద్దిపేట మీదుగా సికింద్రాబాద్ వరకు, అలాగే కరీంనగర్ నుండి హన్మాజీపల్లి మీదుగా గన్నేరువరం మండల కేంద్రానికి వచ్చే రెండు బస్సు సర్వీసులను రెండు నెలల క్రితమే స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో కలిసి ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే గత నాలుగైదు రోజుల నుంచి ఈ బస్సులు రావడం లేదని మండిపడ్డారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలు మండల ప్రజలకు "మూడునాళ్ల ముచ్చట"గా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి సరైన రోడ్డు బస్సులు లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం ప్రయాణించే పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే స్పందించి, చొరవ తీసుకుని నిలిపివేసిన బస్సులను పునరుద్ధరించేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంతాల అంజి రెడ్డి,చొక్కాల శ్రీశైలం, బోయిని మల్లయ్య, కూన మల్లయ్య,కూన లచ్చయ్య, కళ్లెం పోశయ్య, జాలి గోపయ్య,న్యాత రాయనర్సు, వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో 10 శాతం వాటా ఇవ్వాలి

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా**




**యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి) అక్టోబర్ 8:** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కంపెనీ ఆర్జించే లాభాల్లో 10 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ-2 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఏరియా జీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ కార్మికులతో కలిసి సమానంగా విధులు నిర్వహిస్తూ సంస్థ ఉత్పత్తి, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సంస్థ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కూడా భాగస్వామ్యమేనని పేర్కొన్నారు. సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా న్యాయమైన వాటా దక్కేలా 10 శాతం లాభాల వాటాను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి హక్కులను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్ర తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు, సహాయ కార్యదర్శి శాంసన్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

# ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపిక

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** క్రీడలను వార్షిక ప్రణాళికలో భాగం చేయాలని తద్వారా విద్యార్థులకు ఉత్సాహం కలుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా చాలా క్రేజ్ ఉన్న క్రీడలలో ఫుట్బాల్ ఒకటని ఈ క్రీడను ఆడడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో క్రీడలకు సైతం ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని తద్వారా విద్యార్థులకు చదువుకోవడానికి చాలా ఆసక్తి పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. నిర్ణీత సమయంలో ఎక్కువ గోల్స్ చేసిన జట్టు విజేతగా నిలుస్తుందని, ఫుట్‌బాల్ ఆట శారీరక దృఢత్వం, వేగం, సమన్వయం, ఏకాగ్రత, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫుట్‌బాల్ పోటీ ఫిఫ వరల్డ్ కప్ అని అన్నారు. ఫుట్బాల్ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ఇటీవల కాలంలో గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో నిర్వహించినటువంటి ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యార్థులు. ఎం.ఆరాధ్యా రెడ్డి, 9వ తరగతి, డి.సంహిత, 8వ తరగతి, ఈ.గ్రేసి, 8వ తరగతి, పి.అనుమ్, 10వ తరగతి, ముక్రమ్ - 10వ తరగతి, బి.కర్దీప్ - 10వ తరగతి, టి. నిశ్చల్ 10వ తరగతి, కె.ఋషికేష్ 9వ తరగతి ఈ నెల 12, 13, 14 హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ స్కూల్లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనరని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలలోనూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ, విజేతలందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సింగరేణి నర్సరీలు నిర్వీర్యం

**ఫారెస్ట్ కాంట్రాక్టర్లకు మినిమం వేజెస్ కూడా చెల్లించడం లేదు**

**యాజమాన్యం పునరాలోచించి న్యాయం చేయాలి**

**ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి విజయకుమార్**

**యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి) అక్టోబర్ 8:** సింగరేణి సంస్థలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరుపై కార్పొరేట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న నర్సరీలు నిర్వీర్యమవుతున్నాయని ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి విజయకుమార్ ఆరోపించారు. ఫారెస్ట్ కాంట్రాక్టర్లకు కనీస వేతనాలు (మినిమం వేజెస్) కూడా చెల్లించని పరిస్థితి నెలకొందని, దీంతో పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతోందని అన్నారు. ఎయిట్ ఇంక్లైన్ కాలనీలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలోని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో కార్పొరేట్ యాజమాన్యం వైఫల్యం కారణంగా నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అందుకు అనుగుణమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి నర్సరీల టెండర్ల విషయంలో కూడా కాంట్రాక్టర్లపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని విజయకుమార్ తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన సీఎంపీఎఫ్, బోనస్, ఈపీఎస్ తదితర చెల్లింపుల బాధ్యతను సైతం గుత్తేదారులే భరించాలనే నిబంధనలతో టెండర్లను ఆహ్వానించడం వల్ల కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం, ఫారెస్ట్ కార్పొరేట్ జీఎం ఈ అంశంపై పునరాలోచించి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫారెస్ట్ పనులు, నర్సరీల నిర్వహణ సక్రమంగా కొనసాగడంతో పాటు కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## టిబి రహిత గ్రామంగా పెంచికల్‌పేట

**కమాన్‌పూర్, అక్టోబర్ 08, (జనంసాక్షి ) :** టీబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట గ్రామాన్ని టీబి రహిత గ్రామంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్- రెవిన్యూ చేతుల మీదుగా గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పల్లవి మాధవి నారాయణ ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ ఎంపీడీవో ప్రియాంక, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

## వారం తేడాతో కన్నుమూసిన ఆలుమగలు

**పొలంలోనే విగ్రహాలు కట్టించి కొడుకుల పితృభక్తి**



**గన్నేరువరం, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** ఒకే వారంలో భార్యాభర్తలు ఇద్దరూ అనారోగ్యంతో మృతి చెందిన విచిత్ర ఘటన, ఆ తర్వాత వారి ముగ్గురు కొడుకులు చూపిస్తున్న పితృభక్తి స్థానికంగా అందరినీ కదిలిస్తోంది. బోయిని కోమరయ్య (23-08-2021) మరియు బోయిని రామవ్వ (30-08-2021) భార్యాభర్తలు. సరిగ్గా వారం రోజుల వ్యవధిలో ఇద్దరూ అనారోగ్యంతో కన్నుమూశారు. తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేని ముగ్గురు కుమారులు బోయిని మల్లయ్య, బోయిని పోషయ్య, బోయిని అంజయ్య ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. 2023 సంవత్సరంలో తమ సొంత వ్యవసాయ క్షేత్రంలోనే తల్లిదండ్రుల విగ్రహాలను అత్యంత ప్రేమతో ప్రతిష్టించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం పితృమాస రోజున ఆ విగ్రహాల వద్దకు చేరుకుని బియ్యం పోసే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా ముగ్గురు కుమారులు కలిసి తల్లిదండ్రుల విగ్రహాలను పూలమాలలతో ఘనంగా అలంకరించి, నివాళులర్పించారు. తల్లిదండ్రులు బతికున్నప్పుడే కాదు, చనిపోయాక కూడా ఇలా గుర్తుంచుకోవడం నిజమైన పితృభక్తి అని గ్రామస్తులు వారిని అభినందిస్తున్నారు. ఇప్పటి రోజుల్లో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న ఘటనలు చూస్తున్న సమయంలో బోయిని సోదరుల ప్రేమ, భక్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

## కరెంటు కోతల నిరసిస్తూ..

# మంథని-కాటారం ప్రధాన రహదారిపై రైతుల ధర్నా



**మంథని అక్టోబర్ 08, (జనంసాక్షి) :** కరెంటు కోతలను నిరసిస్తూ గురువారం మంథని - కాటారం ప్రధాన రహదారిపై రైతులు బయట నుంచి ధర్నా కు దిగారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్ వద్ద రైతులు సక్రమంగా విద్యుత్ సరఫరా లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని రోడ్డుపైన రాస్తారోకో నిర్వహించి ఆందోళనకు దిగారు. కరెంట్ కోతల కారణంగా పంట పొలాలు ఎండిపోతున్నాయని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో మంథని --కాటారం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న మంథని పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రాస్తారోకో విరమించాలని పోలీసులు కోరగా, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొందరు రైతులు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్నారు. పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో విద్యుత్, సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

# సింగూరు నీళ్లు తగ్గితే.. సంగారెడ్డికి నీటిగండం

- వర్షాభావంతో తగ్గుతున్న జలాశయాల నిల్వలు..
- తాగు, సాగునీటిపై పెరుగుతున్న ఒత్తిడి
- దసరా వరకు సాధారణ సరఫరా..
- ఆ తర్వాత రెండు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీళ్లు





**సంగారెడ్డి, అక్టోబర్ 8 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాను నీటి సమస్య మెల్లగా చుట్టుముడుతోంది. వర్షాభావ పరిస్థితులు, సింగూరు ప్రాజెక్టులో నీటి లభ్యత తగ్గడం, మరమ్మతుల కోసం నీటిని దిగువకు విడుదల చేయాల్సి రావడం రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటి అవసరాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో చెరువులు, కుంటలు, భూగర్భ జలాలపై కూడా ఒత్తిడి పెరుగుతోంది.

వర్షాలు తక్కువగా ఉండటంతో జలాశయాలకు వచ్చే ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. సాధారణంగా వర్షాకాలం ముగిసే నాటికి జలాశయాల్లో తగినంత నీరు నిల్వ ఉండి వేసవి వరకు అవసరాలు తీరుతాయి. ప్రస్తుతం వర్షాభావం కారణంగా ఆ భద్రతా నిల్వలు తగ్గుతున్నాయి. దీనికి తోడు సింగూరు మరమ్మతుల కోసం నీటిని దిగువకు విడుదల చేయడం పరిస్థితిని మరింత సున్నితంగా మార్చింది. సంగారెడ్డి జిల్లాలో తాగునీటి అవసరాలను తీర్చడంలో సింగూరుకు కీలక స్థానం ఉంది. ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు అందించడంలో ఈ జలాశయం ప్రధాన వనరుగా ఉంది. ప్రస్తుతం నీటి లభ్యత తగ్గడంతో భవిష్యత్ సరఫరాపై అధికారులు దృష్టి సారించారు. దసరా వరకు మిషన్ భగీరథ నీటి సరఫరా సాధారణంగా కొనసాగుతుందని, ఆ తర్వాత నీటి లభ్యతను బట్టి రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసే విధానం అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించినట్లు సమాచారం.

నీటి సరఫరాలో మార్పులు వస్తే ప్రజలు ముందుగానే అప్రమత్తం కావాల్సి ఉంటుంది. సరఫరా అయ్యే నీటిని అవసరమైనంత మాత్రమే నిల్వ చేసుకుని తాగునీరు, వంట వంటి అత్యవసర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కుళాయిలు, పైపులు, ట్యాంకుల్లో లీకేజీలను వెంటనే అరికట్టడంతోపాటు నీటిని వృథా చేయకూడదు. వాహనాలు, ఇళ్లు, ప్రాంగణాల శుభ్రతకు తాగునీటిని విచక్షణారహితంగా వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాభావ ప్రభావం తాగునీటితోనే ముగియదు. సాగునీటి లభ్యత కూడా తగ్గే అవకాశం ఉంది. బోర్లు, బావులు, చెరువులు, కాలువలు, ప్రాజెక్టులపై ఆధారపడే రైతులు నీటిని పొదుపుగా వినియోగించాల్సి ఉంటుంది. భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వల్ల నీటి మట్టాలు మరింత తగ్గే ప్రమాదం ఉంది.

అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా పంటల ఎంపిక, సాగు ప్రణాళికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చెరువులు, కుంటలు నిండితే భూగర్భ జలాలు పుంజుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల స్థానిక నీటి వనరులను సంరక్షించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సింగూరులో నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి వినియోగం, ప్రత్యామ్నాయ వనరులపై అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరా సమయాలను ముందుగానే తెలియజేసి, అత్యవసర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి... హోటల్‌లో హత్య



**అమీర్‌పేట్ (జనంసాక్షి):** పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళను హోటల్‌కు తీసుకెళ్లి హత్య చేసి, ఆమె వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలతో పరారైన నిందితుడిని ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నాగసముద్రం గ్రామానికి చెందిన బి. శిరీష (32) తన స్వగ్రామంలో కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేది. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా ఓగ్లాపూర్‌కు చెందిన ఆవుసపల్లి శ్రీనివాస్ (36)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని తప్పుడు హామీ ఇచ్చి ఆమె నమ్మకాన్ని పొందిన శ్రీనివాస్.. ఆమె వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సెప్టెంబర్ 28 రాత్రి శిరీషను అమీర్‌పేట్ డీకే రోడ్డులోని హోటల్ గోకుల్ ప్రైడ్‌కు తీసుకెళ్లిన నిందితుడు, తప్పుడు వివరాలు, నకిలీ గుర్తింపు కార్డుతో రూమ్ నంబర్ 103ను బుక్ చేసుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని శిరీష ఒత్తిడి చేయడంతో ఆగ్రహించిన శ్రీనివాస్.. గదిలో ఉన్న కట్టింగ్ రాడ్/పైపుతో ఆమెపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె వద్ద ఉన్న

**రూ.4 లక్షల నగదుతో పరారీ.. నిందితుడి అరెస్ట్**

సుమారు రూ.4 లక్షల నగదును తీసుకుని, గదికి బయట నుంచి తాళం వేసి పరారయ్యాడు. సెప్టెంబర్ 28 రాత్రి 8.20 గంటల నుంచి 29వ తేదీ తెల్లవారుజామున 3.50 గంటల మధ్య ఈ ఘటన జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**రూ.1.30 లక్షల నగదు స్వాధీనం**

దర్యాప్తులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.1.30 లక్షల నగదు, సుమారు 7.996 గ్రాముల బంగారు గొలుసు, ఒక గ్రాము బంగారు ఉంగరం, మృతురాలి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలోనూ చోరీలకు పాల్పడినట్లు, వివిధ పోలీస్ స్టేషన్లలో అతనిపై ఆరు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసును డీసీపీ వెస్ట్ హిల్స్ జోన్ పర్యవేక్షణలో, ఎస్ఆర్ డివిజన్ ఏసీపీ ఆధ్వర్యంలో, ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఐలు ఎం. నాగరాజు, బి. మధుసూదన్, పోలీసు సిబ్బంది ఎం. మధు, సీహెచ్ శ్రీనివాస్, బి. సురేందర్ సమన్వయంతో ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఏడాది కావస్తున్నా పూర్తికాని నిడ్జింత బ్రిడ్జి పనులు



**కొత్తపల్లి అక్టోబర్ 8 (జనం సాక్షి) :** మద్దూరు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలోని నిడ్జింత గ్రామ శివారులో వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు వెడల్పు ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేసి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇంజక్షన్ అనంతరం మహిళ మృతి

**డీఎంహెచ్‌వో విచారణ.. ఆర్ఎంపీ ఆసుపత్రిని పరిశీలించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు**

**పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు: డీఎంహెచ్‌వో**



**మద్దూరు, అక్టోబర్ 8 (జనంసాక్షి):** మద్దూరు పట్టణంలో మంగళవారం ఆర్ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం ఓ మహిళ మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించారు. గురువారం డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ సంబంధిత ఆర్ఎంపీ ఆసుపత్రిని పరిశీలించి, మహిళకు అందించిన చికిత్స, ఇంజక్షన్, ఇతర వైద్య వివరాలను సేకరించారు. మద్దూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళ మృతి విషయం తమ దృష్టికి వచ్చిందని, బుధవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం మృతికి గల కారణాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళ మృతి నేపథ్యంలో మద్దూరు పట్టణంలోని పలు ఆర్ఎంపీ ఆసుపత్రులను అధికారులు పరిశీలించారు. వైద్య సేవలు, చికిత్స విధానం, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. అధికారులు తనిఖీలకు వస్తున్నారన్న సమాచారంతో కొందరు ఆర్ఎంపీలు క్లినిక్‌లు మూసివేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారిక నిర్ధారణ లేదు. ఆర్ఎంపీలు, క్లినిక్‌లు, మెడికల్ షాపుల అర్హతలు, అనుమతులు, మందుల విక్రయ నిబంధనలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా సేవలు అందిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హతలు, అనుమతుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు ఆర్ఎంపీలకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ఫోన్ పాస్‌వర్డ్ చెప్పలేదని.. కర్రలతో కొట్టి చంపేశారు!

**కందవాడ డంపింగ్ యార్డులో దారుణ హత్య**

**చేవెళ్ల, అక్టోబరు 08 (జనంసాక్షి)** మొబైల్ ఫోన్ విషయంలో జరిగిన వివాదం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారితీసింది. ఫోన్ పాస్‌వర్డ్ చెప్పలేదన్న కోపంతో గుర్తుతెలియని వ్యక్తిని కర్రలతో విచక్షణారహితంగా కొట్టి చంపిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందవాడ డంపింగ్ యార్డు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను కొందరు వ్యక్తులు చేవెళ్ల బస్‌స్టాండ్ వద్ద చోరీ చేసినట్లు సమాచారం. తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని, లేనిపక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు హెచ్చరించాడు. దీంతో నిందితులు అతడిని మాటల్లో పెట్టి మభ్యపెట్టి చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడ డంపింగ్ యార్డు వద్ద ఉన్న ఓ షెడ్డులోకి తీసుకెళ్లారు. అక్కడ ఫోన్ లాక్ తీసేందుకు పాస్‌వర్డ్ చెప్పాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చారు. అయితే అతడు పాస్‌వర్డ్ చెప్పేందుకు నిరాకరించడంతో తొలుత చేతులతో దాడి చేసి, అనంతరం చెక్క కర్రలతో తలపై తీవ్రంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆధారాలను మాయం చేసేందుకు బాధితుడి సెల్‌ఫోన్‌ను డంపింగ్ యార్డులో చెత్త కాలుతున్న మంటల్లో పడేసినట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం సుమారు 1.20 గంటల ప్రాంతంలో ఈ ఘటనకు సంబంధించి ఓ నిందితుడు స్వచ్ఛందంగా చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## అరెస్టు.. రిమాండ్.. బెయిల్

**ఎమ్మెల్యే బస్సు ప్రయాణం దుమారం**

**సోషల్ మీడియా బీఆర్ఎస్ పోస్టులపై కేసులు నమోదు**



**రంగారెడ్డి, అక్టోబర్ 08 (జనం సాక్షి):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సోషల్ మీడియా పోస్టుల దుమారం రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి బస్సు ప్రయాణానికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, దానిపై వ్యక్తమైన విమర్శలు, ప్రతివిమర్శలు చివరికి పోలీసుల అరెస్టుల వరకు వెళ్లాయి.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్య తీరుతెన్నులను పరిశీలించేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇటీవల బొంగులూరు చౌరస్తా నుంచి యంజాల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, కళాశాల విద్యార్థినులు, వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల కలిగే లాభాలను వాకబ్ చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే విద్యార్థినుల చేయిపట్టుకోవడం, వెన్నుతట్టడం వంటి దృశ్యాలతో కూడిన కొన్ని వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఈ వీడియోలు అసభ్యకరంగా ఉన్నాయని, ఎమ్మెల్యే తీరు సరికాదంటూ బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేశాయి. ఈ దుష్ప్రచారంపై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తీవ్రంగా స్పందించారు. అందుకు సంబంధించిన వివరణను ఇచ్చారు. తనపై కావాలనే కొందరు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తల్లి, చెల్లెళ్ల లాంటి వారిని గౌరవించే తనకు అపవాదు అంటగట్టడం తగదని ఆయన ఖండించారు.

**పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు, అరెస్టులు..**

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై జరిగిన దుష్ప్రచారంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్లలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇబ్రహీంపట్నంలో ముగ్గురు, మంచాల, యాచారం పోలీస్ స్టేషన్ల పరిధిలో మరికొందరిని అరెస్టు చేశారు. అనంతరం వారిని ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం వారికి బెయిల్ మంజూరు చేసింది. ఈ పరిణామాలతో నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తారాస్థాయికి చేరాయి. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా, అసభ్యకర పోస్టులు పెట్టినా లేదా వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసినా చట్టరీత్యా నేరమేనని హెచ్చరించారు.

## భవనం ఇలా.. చదువు సాగేదెలా!

- శిథిల భవనాల్లోనే విద్యార్థుల చదువులు
- ఆరేళ్లుగా అసంపూర్తిగా కల్వోర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం
- మధ్యలోనే నిలిచిన రూ.2.25 కోట్ల నిర్మాణం

**అసంపూర్తి భవనంలో పశువులకు ఆవాసం**







**కల్వోర్, అక్టోబర్ 8 (జనం సాక్షి):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కల్వోర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవనం నిర్మాణం ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతులు నిర్వహిస్తున్న పాత రేకుల షెడ్లు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో నీరు కారడం, వేసవిలో ఉక్కపోతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



మండలంలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. తొలుత సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో ప్రారంభమైన కళాశాలలో 2009-10 విద్యా సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపులను ప్రవేశపెట్టారు. దీంతో విద్యార్థుల సంఖ్య 135కు చేరింది. తరగతి గదుల కొరత కారణంగా 2016లో కళాశాలను కల్వోర్ ఉన్నత పాఠశాల భవనానికి మార్చి ఉదయం పాఠశాల, మధ్యాహ్నం కళాశాల తరగతులు నిర్వహించారు. 2018లో ఉన్నత పాఠశాల నూతన భవనంలోకి మారినా జూనియర్ కళాశాలకు మాత్రం మోక్షం లభించలేదు. సుమారు 60 ఏళ్ల నాటి పాత రేకుల షెడ్లలోనే తరగతులు కొనసాగుతున్నాయి. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.2.25 కోట్లతో మొదలై.. మధ్యలోనే ఆగిపోయిన నిర్మాణం**

కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు 2019లో రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. రెండు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టినా పనులు పూర్తికాకుండానే నిలిచిపోయాయి. బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి అసంపూర్తి భవనం విద్యార్థులకు ఉపయోగపడకుండా అలాగే ఉండిపోయింది. తరగతి గదులు, కార్యాలయాలు, ఇతర సౌకర్యాలతో నిర్మించాల్సిన భవనం పూర్తికాకపోవడంతో ప్రస్తుతం నిర్మాణ ప్రదేశం నిరుపయోగంగా మారింది. అసంపూర్తి భవనంలో పశువులు సంచరిస్తూ, ఆశ్రయం పొందుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

**విద్యార్థులకు ఇబ్బందులు**

చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు కల్వోర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్నారు. అయితే సొంత భవనం లేకపోవడం, పాత షెడ్లలో తరగతులు నిర్వహించడం వారి విద్యాభ్యాసానికి ఇబ్బందిగా మారింది. వర్షం పడితే తరగతులు నిర్వహించడమే కష్టంగా మారుతుండగా, ఎండాకాలంలో షెడ్లలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

**వెంటనే నిధులు విడుదల చేయాలి**

కోట్లాది రూపాయలతో ప్రారంభించిన కళాశాల భవన నిర్మాణాన్ని ఏళ్ల తరబడి అసంపూర్తిగా వదిలేయకుండా ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. పెండింగ్ నిధులను విడుదల చేసి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, నూతన భవనంలో తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు

**విచారణకు బాధితుల డిమాండ్**

**చేవెళ్ల, అక్టోబరు 08 (జనంసాక్షి)** చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధిత అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో రేషన్ డీలర్ల ఎంపికకు సంబంధించిన మార్కుల జాబితాను వెల్లడించాలని కోరుతూ ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా కౌకుంట్లకు చెందిన కె.శ్రీనివాస్, కె.సౌజన్య (గుండాల), ప్రభులింగం, విజయకాంత్, అబ్దుల్ ఇనాయత్, విగ్నేష్ (వెంకటాపూర్) మాట్లాడుతూ.. కొత్తగా ఎంపిక చేసిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి కేవలం ఇంటర్ చదివిన వారిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. రేషన్ డీలర్ల ఎంపిక కోసం నిర్వహించిన రాత పరీక్షలో ప్రశ్నపత్రం ముందుగానే లీక్ చేశారనే అనుమానాలు ఉన్నాయని, పరీక్ష కేంద్రంలో రెవెన్యూ అధికారులు తమకు తెలిసిన అభ్యర్థుల వద్దకు పలుమార్లు వెళ్లారని ఆరోపించారు. ఇంటర్వ్యూలో రేషన్ దుకాణ నిర్వహణకు సంబంధించిన ప్రశ్నలకు బదులుగా వ్యవసాయ భూమి ఉందా, ఏ పంటలు సాగు చేస్తున్నారనే ప్రశ్నలు అడిగారని తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చిన మహిళా అభ్యర్థుల పట్ల కూడా అధికారులు అనుచితంగా మాట్లాడారని వారు ఆరోపించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వచ్చిన మార్కులను సైతం అధికారులు వెల్లడించలేదని, ముందుగానే తమకు అనుకూలమైన వ్యక్తులను ఎంపిక చేశారనే అనుమానం కలుగుతోందని బాధితులు పేర్కొన్నారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి రేషన్ డీలర్ల ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని, అవకతవకలు జరిగినట్లు తేలిన చోట తిరిగి పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

# విలువిద్యకు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం

**ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ కార్యక్రమానికి హాజరు కావడం గర్వకారణంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి, ఇతిహాసాల్లో విలువిద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. రామాయణం, మహాభారత కాలం నుంచే విలువిద్యకు విశిష్ట స్థానం ఉందని తెలిపారు. ఏకలవ్యుడు, అర్జునుడు, ద్రోణాచార్యుడు వంటి మహనీయులు విలువిద్యలో ఆరితేరిన వారని గుర్తుచేశారు. విలువిద్య వంటి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని మంత్రి అన్నారు. తెలంగాణలో క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వంటి ప్రతిష్టాత్మక పోటీలు దేశంలో విలువిద్యకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంతో పాటు, యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జపాన్ లో జరిగిన ఏషియన్ గేమ్స్ లో ఆర్చరీ లో గోల్డ్ మెడల్ సాధించిన చికితా రావు తో పాటు వివిధ దేశాలకు చెందిన ఆర్చరీ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

# అంతర్జాతీయ వేదికపై బొంతపల్లి యువకుడి సత్తా

- వేదిక్ మైండ్ కు ప్రపంచస్థాయి టాప్-5లో చోటు




గుమ్మడిదల, అక్టోబర్ 8 (జనంసాక్షి): గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన యువకుడు ముక్కాల ప్రణీత్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వేద గణితంలో చిన్ననాటి నుంచే ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన ప్రణీత్.. తాజాగా హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగిన 2026 ఐఈఈఈ టెక్నాలజీ సమ్మిట్–ఎథికల్ ఏఐలో తన ప్రతిభను చాటారు. ప్రణీత్ రూపొందించిన 'వేదిక్ మైండ్' ప్రాజెక్ట్ ప్రపంచస్థాయి టాప్-5లో చోటు సంపాదించింది. ఐఈఈఈ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ఫౌండర్ షోకేస్-ఐడేషన్ ట్రాక్‌కు 30 దేశాల నుంచి 115 ప్రాజెక్టులు దరఖాస్తు చేసుకోగా, ఎంపికైన ఐదు అత్యుత్తమ ప్రాజెక్టుల్లో వేదిక్ మైండ్ నిలవడం విశేషం. ఈ సందర్భంగా ప్రణీత్ తండ్రి ముక్కాల శంకర్ మాట్లాడుతూ.. తన కుమారుడు పాఠశాల స్థాయి నుంచే వేద గణితంలో ప్రతిభ కనబరిచి, ఇప్పుడు అంతర్జాతీయబవేదికపై ప్రాజెక్ట్ ప్రదర్శించే స్థాయికి ఎదగడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రణీత్ విజయం బొంతపల్లి గ్రామానికి, గుమ్మడిదల ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు.

# సందర్శకుల సందడిలో సారస్ మేళా

- తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలకు మంచి ఆదరణ..
- ఇతర రాష్ట్రాల ఉత్పత్తులకూ భారీ గిరాకీ





**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో జరుగుతున్న సారస్ మేళా రెండో రోజు కూడా సందడిగా కొనసాగింది. నగరంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మేళాకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలు, గ్రామీణ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపించింది.

పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలు, ఇకత్ వస్త్రాలు, చెరియాల్ కళాకృతులు, గిరిజన ఆభరణాలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అదే సమయంలో గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక ఉత్పత్తులను కూడా నగరవాసులు ఆసక్తిగా కొనుగోలు చేశారు.

స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెర్ప్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు, కళాకారులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోంది. మేళా ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, జానపద పాటలు తదితర ప్రదర్శనలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. ప్రత్యేకంగా సెర్ప్ సిబ్బందిలోని పలువురు తమలోని కళా ప్రతిభను ప్రదర్శించడం కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచింది. ఉద్యోగ బాధ్యతలతో పాటు తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించిన సిబ్బందిని ప్రేక్షకులు అభినందించారు.

సారస్ మేళా కేవలం ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ మహిళలకు నగర మార్కెట్‌ను పరిచయం చేసే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్‌పై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం మహిళా సంఘాలకు లభిస్తోంది. ఇది భవిష్యత్‌లో మరిన్ని మార్కెట్ అవకాశాలు, బల్క్ ఆర్డర్లకు దోహదపడనుంది.

మహిళల శ్రమకు మార్కెట్, ప్రతిభకు గుర్తింపు, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటుగా సారస్ మేళా కొనసాగుతోంది. అక్టోబర్ 18 వరకు జరిగే ఈ మేళాను నగరవాసులు సందర్శించి గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**అద్దె కట్టలేక..**

# ఈఎస్ఐ డిస్పెన్సరీలకు తాళాలు

- నెలల తరబడి మందుల కొరత..
- రోగులకు అందని వైద్యం
- ప్రైవేట్ భవనాల అద్దెలు చెల్లించక పలు డిస్పెన్సరీలు మూత




**నాచారం (జనంసాక్షి) :** కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో సమస్యలు రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రితో పాటు దాని పరిధిలోని డిస్పెన్సరీల్లో గత కొన్ని నెలలుగా మందుల కొరత తీవ్రంగా ఉందని రోగులు వాపోతున్నారు. వైద్యులు సూచించిన ఐదారు రకాల మందుల్లో ఒకటి, రెండు మాత్రమే అందుబాటులో ఉండగా, మిగతావి 'నో స్టాక్' అని చెప్పడం సాధారణమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న డిస్పెన్సరీలకు ప్రభుత్వం గత ఏడాది, రెండేళ్లుగా అద్దెలు చెల్లించకపోవడంతో భవనాల యజమానులు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. చిలకలగూడ ఈఎస్ఐ డిస్పెన్సరీతో పాటు నింబోలి అడ్డలోని హిమ్మత్‌పుర, చెప్పల్ బజార్ డిస్పెన్సరీ, సికింద్రాబాద్‌లోని డీఎస్సీకి సంబంధించిన డిస్పెన్సరీ, మౌలాలి–తార్నాకకు సంబంధించిన డిస్పెన్సరీలు మూతబడ్డాయని పేర్కొంటున్నారు. అద్దె బకాయిలు చెల్లించే వరకు డిస్పెన్సరీలను తెరవబోమని భవన యజమానులు స్పష్టం చేసినట్లు సమాచారం.

సొంత భవనాలు లేక ప్రైవేట్ భవనాల్లో డిస్పెన్సరీలు నిర్వహించడం కూడా ఇబ్బందికరంగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఈ సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత, సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడం, శస్త్రచికిత్సలకు సంబంధించిన వైద్యులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని రోగులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో సిబ్బంది దురుసు ప్రవర్తన కూడా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నారు. మందుల కొరత, వైద్య సిబ్బంది సమస్యలపై సూపరింటెండెంట్లకు, ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని రోగులు వాపోతున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికుల జీతాల నుంచి మినహాయించే సొమ్ముతో నడిచే ఈఎస్ఐ ఆసుపత్రుల్లోనే సరైన వైద్యం, మందులు అందకపోవడం దురదృష్టకరమని రోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూతబడిన డిస్పెన్సరీలను తెరిపించి, మందుల కొరతను తీర్చి, కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మద్యం మత్తులో వీరంగం..

- ఆటో డ్రైవర్‌పై దాడి.. ఎస్ఐపైనా దురుసు ప్రవర్తన
- ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి మద్యం మత్తులో కొందరు వ్యక్తులు వీరంగం సృష్టించడం కలకలం రేపింది. ఆటో సైడ్ ఇవ్వలేదన్న చిన్నపాటి వాహన వివాదం కాస్తా.. ఆటో డ్రైవర్‌పై దాడికి, అక్కడితో ఆగకుండా అడ్డుకోబోయిన పోలీసులతో వాగ్వాదానికి, పోలీసులపై దాడికి దారితీసినట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలైనట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. విధుల్లో ఉన్న ఎస్ఐ పై దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ విగ్రహం, జవహర్‌నగర్ కాలనీ హెచ్‌పీ పెట్రోల్ బంక్ పరిసరాల్లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. కాళేశ్వరం వైపు నుంచి భావుసింగ్‌పల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో ఉన్న కొందరు వ్యక్తులు.. ఆటో సైడ్ ఇవ్వలేదన్న కారణంతో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. మాటామాటా పెరగడంతో ఆటోను అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దాడిలో ఆటో డ్రైవర్‌కు గాయాలైనట్లు సమాచారం.

**మద్యం మత్తులో పోలీసులపైనా దురుసు ప్రవర్తన?**

ఘటనపై స్థానికులు 100కు సమాచారం అందించడంతో బ్లూకోట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు పోలీసుల మాటను సైతం లెక్కచేయకుండా వారితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసులపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ఎస్ఐ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఎస్ఐతో దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలు పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

# నార్కట్‌పల్లి ఎస్ఐ వేటు!

**నార్కట్‌పల్లి (జనంసాక్షి) :** భారీగా బంగారం చోరీకి సంబంధించిన కేసులో రికవరీ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పోలీసులు నిందితుడి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నప్పటికీ.. రికవరీలో పూర్తి మొత్తాన్ని చూపించకుండా కొంత బంగారాన్నే లెక్కల్లో చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. బంగారం రికవరీ వ్యవహారంలో నార్కట్‌పల్లి ఎస్సైపై వేటు పడినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నిందితుడి వద్ద నుంచి బంగారం రికవరీ చేసినప్పటికీ.. పూర్తి బంగారాన్ని రికవరీలో చూపించలేదంటూ ఎస్పీకి ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ.. రెండు రోజుల క్రితం సంబంధిత పోలీసులను హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత రెండు రోజుల వ్యవధిలోనే బంగారం రికవరీ కేసులో ఎస్సైపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

**వేములవాడ కథల్లో ఆత్మీయత..**

# 'నల్ల కోర్టు'లో ధిక్కార స్వరం

**సాహిత్య ప్రస్థానాన్ని ఆవిష్కరించిన జింబో మంగారి రాజేందర్**





- మనిషిని వంగదీయడానికి, లొంగదీయడానికి కేసులు పెడతారు : జింబో



**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** రిటైర్డ్ న్యాయమూర్తి, ప్రముఖ రచయిత, కవి జింబో మంగారి రాజేందర్ తన సాహిత్య ప్రస్థానాన్ని ఆవిష్కరించారు. 'సాహిత్య రంగంలో నా జీవన ప్రయాణం' అనే అంశం పై గురువారం హైదరాబాద్‌లోని లమకాన్‌లో ప్రత్యేక సాహిత్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తన సాహిత్య ప్రయాణం, రచనా అనుభవాలు, సాహిత్య రంగంతో తనకున్న అనుబంధాన్ని ఆయన వివరించారు. చరిత్రకారుడు, సామాజికవాది ద్యావనపల్లి సత్యనారాయణ సమన్వయకర్తగా వ్యవహరిం చిన ఈ సమావేశాన్ని ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావు ఏర్పాటు చేశారు. మంగారి రాజేందర్ తన సాహిత్య ప్రయాణంపై సుదీర్ఘంగా ప్రసంగిస్తూ ఆత్మీయత, అనుబంధాలు, మానవ సంబంధాలతోపాటు వేములవాడ కథల గురించి వివరించారు. న్యాయవ్యవస్థలోని లోపాలు, మనిషి జీవితంపై కేసుల ప్రభావాన్ని తన కవిత్వం ద్వారా వివరించారు. 'కేసులు నిలవాలని పెట్టరు.. కేసులు కేసుల కోసమే పెడతారు. మనిషిని వంగదీయడానికి, లొంగ దీయడానికి పెడతారు' అంటూ కేసుల ద్వారా మనిషిని నిర్వీర్యం చేసే పరిస్థితిని కవితాత్మకంగా వివరించారు. తన వేములవాడ కథల గురించి ప్రస్తావిస్తూ.. 'ఒకప్పుడు నేను మా ఊరిలో నివసించాను.. ఇప్పుడు మా ఊరు నాలో నివసిస్తోంది' అంటూ తన ఊరితో ఉన్న అనుబంధాన్ని కవితాత్మకంగా వ్యక్తం చేశారు.

ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావు మాట్లాడుతూ మంగారి రాజేందర్ సుదీర్ఘ సాహిత్య ప్రయాణంలో ఎన్నో కథలు, కవిత్వాలు రాశారని, న్యాయ సంబంధమైన రచనలు కూడా అనేకం చేశారని తెలిపారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమన్వయకర్త ద్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ జింబో రచనలు వేల పేజీలతో ముడిపడి ఉన్నాయని, భవిష్యత్తులోనూ ఆయన నుంచి వేల పేజీల రచనలు వచ్చే అవకాశం ఉందన్నారు. హృదయానికి దగ్గరగా ఉండే వేములవాడ కథలతోపాటు ధిక్కార స్వరాన్ని వినిపించే 'నేను.. నా నల్ల కోర్టు' కథలను కూడా ఆయన రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు నందిగం కృష్ణారావు, వజ్జల శివకుమార్, దాసరాజు రామారావు, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, మాడభూషి శ్రీధర్, అమరవీరుల స్థూపం శిల్పి రమణారెడ్డి, మహంతి వెంకటరావు, నాగసూరి వేణుగోపాల్, సమ్మెట నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370